
# విద్యార్థి వెలుగు

Volume VIII - Issue V - May 2025



# సహవాస ప్రభావం

దేవుడు మనతో సహవాసం చేయడానికి ఇష్టపడుతున్నారు. అది మన భాగ్యం. మనమందరం మన దేవునితో సహవాసం చేయవచ్చు. ఇది విశ్వాస జీవితాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. దేవునితో సహవాసం అనేది ఒక గొప్ప బహుమానం, దానిని మనం ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. ఆయనతో మనకున్న అనుబంధం, మనల్ని మరింత పరిశుద్ధతలో ఎదుగుటకు దోహదపడుతుందనడంలో సందేహం లేదు.

యోహాను 1:3లో ఇలా వ్రాయబడింది, "మన సహవాసమైతే తండ్రితో కూడను ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను ఉన్నది." అంటే మన అనుబంధం తండ్రి అయిన దేవునితో, ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడా ఉంది.

"అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనము వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందము, అప్పుడు ఆయిన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). దీని అర్థం ఏమిటంటే, మనం దేవుని వెలుగులో నడుచుకుంటే, ఒకరితో ఒకరు సహవాసం కలిగి ఉంటాము, అప్పుడు యేసుక్రీస్తు రక్తం మన పాపాలన్నిటినీ కడిగివేస్తుంది.

సహవాసం అంటే దేవునిలో కలిసి ఉండటం, ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం, ఇతరుల అభివృద్ధికి సహాయం చేయడం. పౌలు భక్తుడు థెస్సలోనిక సంఘానికి ఇదే విషయాన్ని గుర్తు చేశాడు. 1 థెస్సలొనీకయులకు 5:11లో, "కాబట్టి మీరిప్పుడు చేయుచున్నట్టుగానే యొకనినొకడు ఆదరించి యొకనికొకడు క్షేమాభివృద్ధి కలుగజేయుడి" అని చెప్పాడు.

ప్రస్తుత పరిస్థితుల్లో, దేవుని రాకడ సమీపంగా ఉన్న తరుణంలో స్టాఫ్, గ్రాడ్యుయేట్లు, విద్యార్థులు ఒకరితో ఒకరు మంచి సహవాసం కలిగి ఉండాలి. దారి తప్పుతున్న విద్యార్థులను దేవుని వైపు నడిపించాలి, వారిని దేవుని సహవాసంలోకి తీసుకురావాలి.

మన ప్రభువైన క్రీస్తును మాదిరిగా తీసుకుని, విద్యార్థుల కోసం ప్రభువు మనకిచ్చిన పరిచర్య బాధ్యతలను నమ్మకంగా నిర్వర్తించాలి. దేవునితో సహవాసం ద్వారా మన రక్షకుడు మనకు శక్తిని, దర్శనమును ఇస్తారు. అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనందరికీ అనుగ్రహించును గాక!

– దాసరి రాజేష్

# విద్యార్థి వెలుగు

Vol. VIII - Issue V - May 2025

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

**EDITORIAL BOARD**

Editor and Publisher:
Mr. Dasari Rajesh, Hyderabad
Managing Editor:
Mr. K. John Bhushanam, Cyberabad
UESI PT TG Branch Sec.:
Mr.V Rajendra Prasad, Hyderabad
**Members:**
Mr. S. Simon, Hyderabad
Mrs. P. Raja Kumari, Hyderabad
Mr. S. Jayaraju, Hyderabad
Mr. Raja Sekhar Addanki, Cyberabad
Mrs. L.Vinodha, Sangareddy

**CONTACT DETAILS**

The Editor, Vidyarthi Velugu
UESI Publication Trust - Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village,
Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Ph: 9491595765
Email: editorvv2018@gmail.com

**SCAN THE QR CODE TO SUBSCRIBE VIDYARTHI VELUGU MAGAZINE**

SCAN ME

**Annual (Hard+Soft copy)**
Students -150/-
Graduates - 300/-
**For 3 Years (Hard+Soft copy)**
Students - 450/-
Graduates - 900/-
**Life (10 Years - Hard+Soft copy)**
Students & Graduates - 2000/-
**Overseas (10 Years - Soft copy)**
Students & Graduates - 2000/-

**Publication Trust Account**

Name - UESI PUBLICATION TRUST
Bank - Canara Bank
A/C No - **0624101037187**
Branch - Pragathinagar
IFSC code - CNRB0004173
Kindly inform the office after depositing amount.
Ph. **8985482388**

**Please furnish the following details**

Address, Pincode, Phone Number, Mail Id, Payment Transaction Details

**THEMES:**

June - Discipleship
July - Living in Hope
Aug - Living as a Light

Please send your writeups on or before **10th of every month** to editorvv2018@gmail.com

## పాఠకుల స్పందన ...

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన ...** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు.

## విషయ సూచిక

| | |
|---|---|
| సహవాసం – బైబిల్ ఆధారంగా | 4 |
| సహవాసం పెంపొందించుకోవడం | 8 |
| సహవాసం – విశ్వాసికి బలమైన అండదండ | 12 |
| కన్నీటితో ప్రార్థిద్దాం | 15 |
| క్యాంపస్‌ను దేవుని కళ్ళతో చూడటం | 16 |
| దేవుని స్వరమా? – డిజిటల్ స్వరమా? | 19 |
| ఆత్మీయ నిద్ర | 22 |
| దైవ సేవలో కుటుంబ విలువలు | 24 |
| క్రైస్తవ హతసాక్షి – బ్లాండినా | 26 |
| ప్రేమతో అమ్మకు! | 29 |

## విజ్ఞప్తి

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు రక్షకుడు, ప్రభువునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ క్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాము.

1. అడ్రస్ మారినా, మ్యాగజైన్ రాకపోయినా, నూతన సబ్‌స్క్రిప్షన్, రెన్యువల్ కొరకు ఆఫీస్ స్టాఫ్ బ్రదర్ డి.సాయి కుమార్ (79933 97630) ను సంప్రదించగలరు.
2. విద్యార్థి వెలుగు పోస్టల్ అవాంతరాలు లేకుండునట్లు, అందరూ చదివి ఆత్మీయ మేలు పొందేటట్లు భారంగా ప్రార్థించండి, ప్రోత్సహించండి.

ప్రతి నెల ప్రార్థనాంశాలు **10**వ తారీఖు లోపల **ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన** రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాల ను **మాత్రమే** వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ **ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు** editorvv2018@gmail.com **కు పంపించగలరు.**

– విద్యార్థి వెలుగు ఎడిటోరియల్ బోర్డ్



# సహవాసం

## బైబిల్ ఆధారంగా

క్రైస్తవ విశ్వాసంలో 'సహవాసం' అనేది ఒక ముఖ్యమైన అంశం. ఇది దేవునితో, తోటి విశ్వాసులతో అనుబంధాన్ని సూచిస్తుంది. ఈ అనుబంధం కేవలం ఒక సామాజిక సంబంధం మాత్రమే కాదు, ఇది ఒక ఆధ్యాత్మిక అనుభవం. బైబిల్ గ్రంథం సహవాస ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. కాబట్టి, సహవాసాన్ని అర్థం చేసుకోవడం ద్వారా మన సంబంధాల ను మెరుగుపరచుకోవడమే కాకుండా దేవునితో, తోటి విశ్వాసులతో మన అనుబంధాన్ని మరింతగా పెంచుకోవచ్చు. ఈ ఆర్టికల్‌లో, సహవాస అంటే ఏమిటి?, దాని మూలాలు, ఆది సంఘం చూపిన ఉదాహరణలు, విశ్వాసులలో నిజమైన సహవాసాన్ని నిర్వచించే ముఖ్య విషయాలను మనం తెలుసుకుందాం.

## సహవాసం అంటే ఏమిటి?

'సహవాసం' అనే పదం గ్రీకు పదం 'కోయినోనియా' నుండి వచ్చింది. కోయినోనియాను "ఉమ్మడిగా ఏదైనా కలిగి ఉండటం" అని నిర్వచించ వచ్చు. ఇది ప్రత్యేకంగా కొత్త నిబంధనలో 20 సార్లు ఉపయోగించబడింది (ఉదా., ఫిలిప్పీ 2:1-2, అపొ. కార్య. 2:42, 1 యోహాను 1:6-7). కోయినోనియా అనేది క్రైస్తవుల ఉమ్మడి నమ్మకాలు, దృఢవిశ్వాసాలు, ప్రవర్తనల నుండి వచ్చే ఆత్మ కలిగి ంచు ఐక్యతను వివరిస్తుంది. ఆ ఉమ్మడి విలువలు ఉన్నప్పుడు, నిజమైన కోయినోనియా (బైబిల్ ఆధారిత సహవాసం) జరుగుతుంది.

## సహవాసానికి పునాది త్రిత్వం

ప్రతి గొప్ప భావనకు ఒక శక్తివంతమైన పునాది ఉంటుంది. సహవాసం కూడా దీనికి మిన హాయింపు కాదు. పరిపూర్ణ సహవాసం త్రిత్వంలో వ్యక్తీకరించబడింది, నమూనాగా చూపబడింది – తండ్రి అయిన దేవుడు, కుమారుడైన దేవుడు (యేసు క్రీస్తు), పరిశుద్ధాత్మ దేవుడు. విశ్వంలోని సహవాసం మొత్తం త్రిత్వంలోని ఈ సహవాసం నుండి వచ్చింది. త్రిత్వంలోని వ్యక్తుల మధ్య ఐక్యత, ఒకే ఉద్దేశం ఉన్నాయి. వారు ఒకరికొకరు వ్యతిరేకంగా పని చేయరు.

త్రిత్వంలో, కమ్యూనికేషన్ ప్రవాహం ఉంది. వారి కమ్యూనికేషన్‌లో గందరగోళం లేదు లేదా వాస్తవాలను తప్పుగా ప్రదర్శించడం లేదు. త్రిత్వంలో, ఒకరి పట్ల ఒకరికి గౌరవం ఉంది; వారు ఒకరి నొకరు గౌరవించుకుంటారు. త్రిత్వంలో కార్యాచరణ ఉంది, ఇక్కడ ప్రతి వ్యక్తి సాధారణ ఉద్దేశాన్ని కోల్పోకుండా వారి పనిని నిర్వహిస్తారు. అందువల్ల, మొత్తం సహవాసం త్రిత్వం నుండి ప్రవహిస్తుంది. ఇది మనకు ఒక ప్రేరణ. మనం ఈ త్రిత్వ సహవాసాన్ని అనుసరిస్తే, మన జీవితాల్లోనూ ఐక్యత ఎలా వికసిస్తుందో చూస్తాం. అంతేకాకుండా, మనం దేవుని శక్తిని ఆనుభవించ గలం!

## ఆది సంఘ సహవాసం

అపొ. కార్య. 2:42-47లో, రచయిత ఆది సంఘంలో సహవాస నాణ్యతను సంక్షిప్తంగా వివరించాడు. 42వ వచనం, "వారు అపొస్తలుల బోధనలోను, సహవాసంలోను, రొట్టె విరుచుటలోను, ప్రార్థనలోను స్థిరంగా ఉన్నారు" అని పేర్కొంది. విశ్వాసుల మధ్య సహవాసం దేవునితో ఉన్న సహవాసం నుండి ఉద్భవించింది. ఈ నాలుగు విషయాలలో వారి స్థిరత్వం ప్రభువుతో వారి సాన్నిహిత్యాన్ని ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా, ఇది తోటి విశ్వాసులకు సహజంగా వ్యాప్తి చెందు తుంది.

ఆది సంఘ సహవాసం యొక్క కొన్ని ముఖ్య లక్షణాలు:

- వారి సహవాసం దేవుని భయంతో కూడు కున్నది (43వ).
- వారి సహవాసం అద్భుతాలు, గొప్ప కార్యాలకు దారితీసింది (43వ).
- వారి సహవాసం విశ్వాసులు కలిసి వచ్చి వారికి ఉన్నదాన్ని పంచుకోవడానికి వీలు కల్పించింది (44వ).
- వారి సహవాసం వారి స్థిర, చరాస్తులను అమ్మి ఇతరులకు ఇవ్వడానికి ప్రోత్సహించింది (45వ).
- వారి సహవాసం ఇతరుల అవసరాలను చూడటానికి వారిని ప్రేరేపించింది (45వ).
- వారి సహవాసం వారిని ఏక హృదయంతో ఆరాధన చేసేలా దగ్గర చేసింది (46వ).
- వారి సహవాసం ఇతరులపై ప్రభావం చూపింది, ప్రజల దయ పొందేలా వీలు కల్పించింది (46వ).
- వారి సహవాసం పొంగిపొరలే ఆనందాన్ని తెచ్చింది (47వ).
- వారి సహవాసంలో వేషధారణ లేదు (47వ).
- వారి సహవాసం ఇతరులను క్రీస్తును అనుసరించడానికి ఆకర్షించింది (47వ).

## సహవాసం – సూత్రాలు

ఆది సంఘ ఆచరణలు, కొత్త నిబంధన బోధనల నుండి సహవాసానికి సంబంధించి కొన్ని ముఖ్యమైన అంశాలను తీసుకోవచ్చు:

### 1. ఇతరులతో సంబంధం, ఒకరిపై ఒకరు ఆధార పడడం సహవాసానికి గుర్తులు

మన సహవాసానికి పునాది దేవునిపై ఆధార పడటమే. ఒకవేళ దేవునిపై ఆధారపడకపోతే, మన సహవాసం పునాది లేని ఒక పైకప్పుగా ఉంటుంది. దేవునితో సంబంధం లేని సహవాసం కేవలం ఒక సిద్ధాంతం మాత్రమే అవుతుంది. ఒకరు ఈ విధంగా చెప్పారు, "క్రైస్తవ మతం పాలస్తీనాలో ఒక సహవాసంగా ప్రారంభమైంది. అది గ్రీస్‌కు వెళ్లి ఒక తత్వశాస్త్రంగా మారింది. తరువాత ఇటలీకి వెళ్లి ఒక వ్యవస్థగా మారింది. ఐరోపాకు వెళ్లి ఒక సంస్కృతిగా మారింది. ఆ తరువాత అమెరికాకు వచ్చి ఒక వ్యాపారంగా మారింది. మూడవ ప్రపంచ దేశాలకు వెళ్లి ఒక కార్యక్రమంగా మారింది. నేడు ఉజ్జీవ సభలలో, అది ప్రదర్శన రూపాన్ని తీసుకుంది."

బైబిల్ సంబంధ సహవాసం రెండు రకాలుగా ఉంటుంది: మొదటిది నిలువు సంబంధం (దేవునితో సంబంధం), రెండవది సమాంతర సంబంధం (తోటి విశ్వాసులతో సంబంధం). దేవునితో నిలువు సహవాసం లేకుండా తోటి విశ్వాసులతో సమాంతర సహవాసం ఉండదు. ప్రార్థన, బైబిల్ పఠనం, పరిశుద్ధాత్మకు విధేయత చూపడం ద్వారా ప్రతిరోజు దేవునితో నిలువు సహవాసాన్ని కొనసాగించవచ్చు. ప్రేమించడం, శ్రద్ధ వహించడం, పంచుకోవడం, ఒకరినొకరు భరించడం ద్వారా తోటి విశ్వాసులతో సమాంతర సహవాసాన్ని పెంపొందించుకోవచ్చు. తోటి విశ్వాసులతో సహవాసం లేకుండా దేవునితో సహవాసం ఉందని చెప్పడం కేవలం ఒక అబద్ధం.

### 2. పరిశుద్ధత, యదార్థత సహవాసానికి ఆధారాలు

సహవాసంలో పరిశుద్ధత, నిజాయితీ చాలా ముఖ్యం. ఆది సంఘంలో ఒక గౌరవప్రదమైన భయం ఉండేది. ప్రభువును సంతోషపరచనది ఏదైనా ఉంటే ప్రతి ఒక్కరూ భయపడేవారు. ఇది ప్రజలపై ప్రేమకు దారితీసింది, తమ ఆస్తులను అమ్మేంత స్థాయికి చేరుకున్నారు. మన సహవాసాలలో పరిశుద్ధత లేకపోతే వేషధారణ, పక్షపాతం, స్వార్థం చోటు చేసుకుంటాయి. అప్పుడు 'ప్రేమ' అనేది కేవలం పైకి మాత్రమే కనిపిస్తుంది. పరిశుద్ధత లేని సహవాసం నిస్సారమైనది, ఎక్కువ కాలం నిలబడదు.

### 3. ఆరాధన, అద్భుతాలు సహవాసానికి ఫలితాలు

మన సహవాసాలలో ఆరాధన, బైబిల్ పఠనం, ప్రార్థన ద్వారా ప్రభువు మహిమపరచబడాలి. మన ఆరాధనకు ప్రతిస్పందనగా, ఆధ్యాత్మిక స్వస్థత, మేల్కొలుపు, పునరుద్ధరణ, పునరంకితం వంటి అద్భుతాలు జరుగుతాయి.

### 4. పాలిభాగస్తులవడం, పాలుపొందడం సహవాసానికి వాహనాలు

సహవాసం అంటే కేవలం సమావేశాలు కావు. అవి పరిచర్యలో భాగస్వామ్యాన్ని ప్రతిబింబించాలి. సహవాసంలోని ప్రతి ఒక్కరికీ దేవుని రాజ్య విస్తరణలో ఒక పాత్ర ఉంది. ప్రతి శిష్యుడు గొప్ప ఆజ్ఞను నెరవేర్చడానికి తోటి విశ్వాసులతో భాగస్వామ్యం కావాలి. యేసుక్రీస్తు తన శిష్యులతో కలిసి పరిచర్య చేశాడు. పౌలు బార్నబా, తిమోతి, తీతు వంటి వారితో కలిసి పని చేశాడు.

### 5. భిన్నత్వం, అవశ్యకత సహవాసాన్ని బలపరిచే నిదర్శనాలు

సహవాసంలోని ప్రతి ఒక్కరూ దేవుడిచ్చిన ప్రత్యేక బహుమతులను తమ కోసం కాకుండా, సహవాసం అభివృద్ధి కోసం ఉపయోగించాలి. ఎవరూ స్వతంత్రులు కాదు. ప్రతి ఒక్కరూ ఒకరిపై ఒకరు ఆధారపడి ఉండాలి. అప్పుడే సహవాసం అందంగా, సంపూర్ణంగా ఉంటుంది. సహవాసంలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు, కానీ

ఎవరు బాస్ కాదు, నిరంకుశత్వం లేదు. ప్రతి ఒక్కరూ సమిష్టి బలానికి తోడ్పడాలి.

### 6. ఏకత్వం, ఒకరి కొరకు ఒకరు సహవాస ఫలాలు

సహవాసంలో ఆత్మ కలిగించు ఐక్యత చాలా ముఖ్యం (ఎఫెసి 4:1). అభిప్రాయ భేదాలు ఉండవచ్చు, కానీ ఐక్యతకు భంగం కలగకూడదు. ఐక్యత అంటే అందురూ ఒకేలా ఉండాలని కాదు. ఐక్యతను కాపాడుకోవడానికి సహవాసంలోని ప్రతి ఒక్కరూ లేఖనాల్లోని 'ఒకరినొకరు' అనే సూత్రాలకు కట్టుబడి ఉండాలి. లేఖనంలో కనిపించే కొన్ని 'ఒకరినొకరు' సూత్రాలు క్రింది ఇవ్వబడ్డాయి:

* ఒకరితో ఒకరు సమాధానంగా ఉండాలి (మార్కు 9:50).
* ఒకరినొకరు ప్రాధాన్యత ఇవ్వాలి (రోమా 12:10).
* ఒకరితో ఒకరు ఏకీభవించాలి (రోమా 12:16).
* ఒకరినొకరు తీర్పు తీర్చవద్దు (రోమా 14:13).
* ఒకరినొకరు అభివృద్ధి చేసుకోవాలి (రోమా 14:19).
* ఒకరినొకరు అంగీకరించాలి (రోమా 15:7).
* ఒకరినొకరు హెచ్చరించుకోవాలి (రోమా 15:14).
* ఒకరి పట్ల ఒకరు ఒకే రకమైన శ్రద్ధ వహించాలి (1 కొరింథీ 12:25).
* ఒకరికొకరు సేవ చేయాలి (గలతీ 5:13).
* ఒకరిపట్ల ఒకరు సహనం చూపాలి (ఎఫెసి 4:2).
* ఒకరితో ఒకరు సత్యం మాట్లాడాలి (ఎఫెసి 4:25).
* ఒకరిపట్ల ఒకరు దయగా ఉండి, క్షమించాలి (ఎఫెసి 4:32).
* ఒకరికి ఒకరు లోబడి ఉండాలి (ఎఫెసి 5:21).
* ఒకరినొకరు భరించి క్షమించాలి (కొలొస్సి 3:13).
* ఒకరినొకరు రక్షణ కలిగించు మాటలతో ఆదరించుకోవాలి (1 థెస్స 4:18).
* ఒకరితో ఒకరు శాంతంగా జీవించాలి (1 థెస్స 5:13).
* ఒకరికి ఒకరు మంచిగా ఉండటానికి ప్రయత్నించాలి (1 థెస్స 5:15).
* ఒకరినొకరు దూషించవద్దు (యాకోబు 4:11).

ఒక శరీరంలోని సభ్యులుగా (1 కొరింథీ 12:27), మనం ఒకరి పట్ల ఒకరు శ్రద్ధ చూపించ డానికి పిలువబడ్డాం.

క్రైస్తవ సహవాసం అనేది దేవుని ఆజ్ఞ. దీనిని పాటించడం ఒక ఆధిక్యత, బాధ్యత కూడా. మనం కలిసి ఉన్నప్పుడు ఒకరినొకరు ఆశీర్వదించు కుంటాం. కాబట్టి, దేవుని ఆజ్ఞలకు లోబడి, మన సహవాసాన్ని మరింత ప్రామాణికంగా, క్రీస్తు ఆధారితమైనదిగా చేయడానికి మనం స్పృహతో, ఉద్దేశపూర్వకంగా బాధ్యత తీసుకోవాలని పిలువ బడుతున్నాం.

### ముగింపు

బైబిల్ ఆధారంగా సహవాస ప్రాముఖ్యతను మనం అర్థం చేసుకోవాలి. త్రిత్వ దేవుని దాని పునాదిగా గుర్తించాలి. సహవాసాన్ని నిర్వచించే ముఖ్యమైన సూత్రాలను స్వీకరించాలి. అప్పుడే విశ్వాసుల మధ్య శక్తివంతమైన, అర్థవంతమైన సహవాసాన్ని పెంపొందించుకోగలుగుతాం.

క్రీస్తు ప్రేమ, ఐక్యతను ప్రతిబింబించే సంఘాన్ని పెంపొందించడానికి మన జీవితాల్లో ఈ సూత్రాల ను కలిగి ఉండటానికి ప్రయత్నిద్దాం. కలిసి, మనం నిజమైన "కోయినోనియా" వాతావరణాన్ని సృష్టించవచ్చు, ఇది మన జీవితాలను మాత్రమే కాకుండా మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కూడా ప్రభావితం చేస్తుంది.

– స్టాన్లీ జోన్స్,
మంచిర్యాల

ఆధ్యాత్మికం



# సహవాసం పెంపొందించుకోవడం

“జీవితం అనేది ఒంటరిగా పాడుకునే సంగీతం కాదు, అది ఒక బృంద గానం లాంటిది. మనం పుట్టినప్పటి నుండి మరణించే వరకు సంబంధాలల్లో జీవిస్తాం” అని ఒకరు అన్నారు.

బైబిల్‌లో “ఒకరినొకరు” అనే పదం సుమారు 59 సార్లు కనిపిస్తుంది. ఇది క్రైస్తవులు పరస్పర సంబంధాలలో బలంగా ఉండాలని స్పష్టం చేస్తుంది. మన మధ్య ఉండే సాన్నిహిత్యం, ఐక్యత, సమైక్యత అనే భావనను “సహచర్యం” అనే పదం అర్థవంతంగా వర్ణిస్తుంది.

సహవాసం అనే పదం గ్రీకు పదం ‘కోయినోనియా’ నుండి వచ్చింది. సంబంధాలలో దాని అర్థం, ఆచరణలో ఇది చాలా ప్రత్యేకమైనది. క్రీస్తును అనుసరించడం అంటే ప్రేమ, నీతి, సేవ – ఇవన్నీ సంబంధాల ద్వారానే సాధ్యమవుతాయి, వ్యక్తీకరించవచ్చును. అందుకే బిల్లీగ్రహం,“క్రైస్తవ్యం సహవాసానికి సంబంధించిన మతం” అని అన్నారు.

## సహవాసం: దేవుని ఉద్దేశం

ఆదికాండము 2వ అధ్యాయం 18వ వచనంలో దేవుడు, “నరుడు ఒంటరిగా ఉండటం మంచిది కాదు” అని చెప్పాడు. దేవుడు మనిషిని సహవాసం చేసే వ్యక్తిగా సృష్టించాడు. మనిషిని ఇతరులతో సంబంధాలు పెట్టుకునేలా, దేవునితో కూడాను సంబంధాన్ని ఏర్పరచుకునేలా దేవుడు సృష్టించాడు. కాబట్టి ఒంటరిగా ఉండటం దేవుని చిత్తం కాదు. అందుకనే “నరుడు ఒంటరిగా ఉండటం మంచిది కాదు” అని దేవుడు చెప్పాడు. మనకు సహవాసం ఉండాలని దేవుడు కోరుకుంటున్నాడు.

## సహవాస లక్ష్యం

మన సహవాస లక్ష్యం ఏమిటంటే – “మనవలె అమూల్య విశ్వాసం గల విద్యార్థులందరితో సహవాసం చేయుట ద్వారా, ముఖ్యంగా వాక్యధ్యానం, ప్రార్థనల ద్వారా క్రైస్తవ జీవితంలో ఒకరికొకరు పరస్పరం సహాయపడుతూ, ఎదుగుతూ క్రీస్తు కొరకు సాక్షులుగా ఉండేలా ప్రోత్సహించుకోవడం.” గ్రాడ్యుయేట్లుగా, విద్యార్థులుగా మనమందరం ఒకే విశ్వాసాన్ని, దేవుని, ఆత్మను, ఉద్దేశ్యాన్ని కలిగియున్నాం. అందుకే పౌలు “శరీరము ఏకమై యుండినను

అనేక అవయవములు కలిగియున్నట్టును, శరీరము యొక్క అవయవములన్నియు అనేకములై యుండినను ఒక్క శరీరమై యున్నట్టును, క్రీస్తు కూడ అట్టివాడే. యూదులమైనను గ్రీకులమైనను, దాసుల మైనను స్వతంత్రులమైనను, మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను త్రాగెదము. శరీరము ఒక్క అవయవము కాదు, అనేక అవయవములు కలది" అని అన్నాడు (1 కొరింథీ 12:13). ఈ సహవాసం క్రీస్తు శరీరాన్ని సూచిస్తుంది. ఆయన ఈ సహవాసానికి శిరస్సు. ఈ సహవాసం సార్వత్రిక సంఘంలో ఒక భాగం. ఈ సహవాసాన్ని విమోచించడానికి క్రీస్తు తనను తానుగా త్యాగంగా అర్పించాడు. పేతురుతో, "ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దానిని జయింపవు" అని చెప్పెను. యేసుక్రీస్తు భూమిపై ఈ సహవాసం, సంఘం తప్ప మరేదీ కలిగిలేడు.

## సహవాసాన్ని పెంపొందించడానికి ఆచరణాత్మక మార్గాలు

### 1. దేవుని వాక్యం

మన సహవాసాలలో లేఖనాలను కేంద్రంగా చేసుకోవాలి. దేవుని వాక్యాన్ని చర్చించడం, అధ్యయనం చేయడం, అత్యంత గౌరవంగా చూడటం చాలా అవసరం. బైబిల్ అధ్యయనం ద్వారా సహవాసం కలిగి ఉండటమే మన సహవాసం లక్ష్యం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. మన సమావేశాలు ప్రజల అభిప్రాయాల కంటే లేఖనాల పైనే కేంద్రీకృతమై ఉండాలి.

ఆది సంఘం దేవుని వాక్యమైన అపొస్తలుల బోధనలకు కట్టుబడి ఉంది. అందుకే వారి సహవాసం శక్తివంతంగా ఉంది. మన గ్రాడ్యుయేట్లు దేవుని వాక్యంలో లోతుగా పాతుకుపోవాలి. ప్రతి గ్రాడ్యుయేట్ ఇజియఫ్‌లో అధ్యయనం కోసం నిర్ణయించిన వాక్యభాగాన్ని ముందుగానే చదవాలి. బైబిల్ స్టడీ లీడర్ కనీసం ఒక వారం ముందుగానే చర్చకు సంబంధించిన ప్రశ్నలను అందించాలి. తద్వారా ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండి, ఆ చర్చలో అర్థవంతంగా పాలుపంచుకుంటారు.

మన బైబిల్ స్టడీస్, ఇజియఫ్ సహవాసాలు డైనమిక్‌గా, ఆసక్తికరమైన చర్చలతో జీవితానికి అన్వయించుకునే విధంగా ఉండాలి. దేవుని వాక్యానికి మన జీవితాలపై అధికారం ఉందని, పాపభరితమైన జీవితాలను మార్చే సామర్థ్యం దానికి ఉందని మనం విశ్వసించాలి, అంగీకరించాలి. యేసు ఇలా చెప్పెను – "కాబట్టి నా ఈ మాటలు విని వాటిని అనుసరించు ప్రతివాడు బండ మీద తన ఇల్లు కట్టుకున్న తెలివైన వానితో సమానుడు. అయితే నా ఈ మాటలు విని వాటిని అనుసరించని ప్రతివాడు ఇసుక మీద తన ఇల్లు కట్టుకున్న బుద్ధిహీనునితో సమానుడు."

కీర్తనకారుడు కీర్తన 119లో ఇలా అంటాడు – "నీ ఆజ్ఞలు ఎల్లప్పుడు నాతో ఉన్నాయి మరి యు నన్ను నా శత్రువులకంటే జ్ఞానవంతునిగా చేస్తాయి. పెద్దలకంటే నాకు ఎక్కువ వివేచన ఉంది, ఎందుకంటే నేను నీ కట్టడలను అను–సరిస్తాను. నా బోధకులందరికంటే నాకు ఎక్కువ అంతర్దృష్టి ఉంది, ఎందుకంటే నేను నీ శాసనాలను ధ్యానిస్తాను." దేవుని వాక్యం మనల ను జ్ఞానవంతులుగాను, మరింత అవగాహన కలిగి నవారిగాను, మరింత అంతర్దృష్టి కలిగినవారిగా చేస్తుంది. మన సహవాసాలలో దేవుని వాక్యాన్ని ఎత్తైన స్థానంలో ఉంచుదాం.

### 2. ప్రార్థన

ఆది సంఘం పాటించిన అనేక ఆచరణలలో ప్రార్థన ఒకటి. అయితే, నేటి దినాలో ప్రార్థన సమావేశాలకు హాజరయ్యే వారి సంఖ్య తగ్గి పోవడం ఆందోళన కలిగిస్తుంది. రాత్రంతా చేసే

ప్రార్థనలు గతకాలపు వైభవంగా మారిపోయాయి. ప్రార్థన అనేది మిషన్ పని వెనుక ఉన్న శక్తి అని మనం తెలుసుకోవాలి.

అపొస్తలుల కార్యములు 13:2,3 వచనాల్లో మనం చూసినట్లుగా, "వారు ప్రభువును ఆరాధించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ నేను పిలిచిన పనికొరకు బర్నబాను సౌలును నాకు ప్రత్యేకపరచుడని చెప్పెను. అప్పుడు వారు ఉపవాసము చేసి ప్రార్థనచేసి వారిమీద చేతులుంచి వారిని పంపిరి." వారు ప్రార్థనలో నిమగ్నమై ఉండగా దేవుడు వారిని ప్రత్యేక పరిచి తన పనికి పిలిచాడు. దీనిని బట్టి ప్రార్థన ఎంత శక్తివంతమైనదో మనం అర్థం చేసుకోవచ్చు.

పాపం కోసం దు:ఖించడం చాలా ముఖ్యం. యిర్మీయా దు:ఖిస్తూ, "నా తల నీళ్లయినట్టు ఉండును గాక" అని చెప్పాడు, కీర్తనకారుడు "నా కన్నుల నుండి నదులు పారుచున్నవి" అని చెప్పాడు. అయితే, మన హృదయాలు ఎండిపోయినందున మన కళ్ళు కూడా పొడిగా ఉన్నాయి. మనం కనికరం లేని భక్తిని కలిగి ఉన్న రోజుల్లో జీవిస్తున్నాం. కష్టపడుతున్న కొంతమంది రక్షణ సైన్యం అధికారులు విలియం బూత్‌కు ఒక ఉత్తరం రాస్తూ తాము అన్ని విధాలా ప్రయత్నించినా విఫలమయ్యామని చెప్పినప్పుడు ఆయన "కన్నీళ్లు ప్రయత్నించండి!" అని సమాధానం పంపాడు. వారు అలాగే చేసి గొప్ప ఉజ్జీవాన్ని చూశారు. బైబిల్ పాఠశాలలు కన్నీళ్లను నేర్పించవు, కానీ అది ఆత్మ ద్వారా వచ్చే అనుభవం. మన కాలంలో కూడా దేవుడు అలాంటి ఉజ్జీవాన్ని దయచేయాలని ప్రార్థిద్దాం. ప్రార్థనకు మించిన మార్గం లేదు.

### 3. వినడం

మనిషి సంఘజీవి. ఒంటరిగా ఉండటం ఎవరికీ ఇష్టం ఉండదు. ఒంటరితనం, ఏకాంతం మనల్ని ఎన్నో సమస్యల్లోకి నెట్టేస్తాయి. అందుకే మనమందరం అర్థవంతమైన సంబంధాలను కోరుకుంటాం. ఈ విషయాన్ని వివరిస్తూ లార్సన్ అనే రచయిత ఒక చక్కని ఉదాహరణ ఇచ్చారు. ఆయన ఏమన్నారంటే... "చర్చిలో క్రీస్తు అనుగ్రహించే సహవాసానికి బార్ ఒక నకిలీ ప్రతిరూపం. బార్ దేవుని దయకు బదులుగా మద్యం పంచుతుంది. నిజానికి దూరంగా తప్పించుకునే మార్గాన్ని చూపిస్తుంది. కానీ అది ఒక అనుమతించే, అంగీకరించే మరియు కలిపేసే స్నేహపూర్వక కూటమి. ఇది ప్రజాస్వామ్యబద్ధమైనది. ఇక్కడ ప్రజలు తమ రహస్యాలను ఒకరితో ఒకరు పంచుకుంటారు. వారు సాధారణంగా వాటిని ఇతరులకు చెప్పరు. ఈ బార్ వృద్ధి చెందుతున్నది, ఎక్కువ మంది మద్య వ్యసనపరులు కావడం వల్ల కాదు, కానీ తెలుసుకోవాలనే, తెలియబడాలనే కోరిక, ప్రేమించాలనే, ప్రేమించబడాలనే కోరికను దేవుడు మానవ హృదయంలో ఉంచాడు కాబట్టి."

మనమందరం ఎవరితోనైనా మనసు విప్పి మాట్లాడాలని కోరుకుంటాం. మన మాటలను శ్రద్ధగా వినే ఒక వ్యక్తి మనకు కావాలి. కార్పొరేట్ ప్రపంచంలో ఉద్యోగులు పార్టీల కోసం ఎందుకు ఎదురు చూస్తారో గమనించండి. అక్కడ మద్యం సేవిస్తూ తమ బాధలను, సంతోషాలను ఒకరితో ఒకరు పంచుకుంటారు. గ్రాడ్యుయేట్లు ఇతరుల మాటలను ఓపికగా వినే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలి.

దీని గురించి బైబిల్‌లో యాకోబు తన లేఖలో ఇలా అంటాడు: "నా ప్రియ సహోదరులారా, ... వినుటకు వేగిరపడువాడును, మాటలాడుటకు నిదానించువాడును...." (యాకోబు 1:19). సహోదరులారా, మనం శ్రద్ధగా విందాం.

### 4. కలిసి ఎదగడం

మనం తరచుగా సహవాసంలో పరిపూర్ణత కోసం చూసి నిరాశ చెందుతాం. అసంపూర్ణులైన వ్యక్తుల సమూహం పరిపూర్ణ సహవాసాన్ని ఎలా ఏర్పరుస్తుంది? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసు కోవాలంటే మనం ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అసంపూర్ణులైన వ్యక్తులు పరిపూర్ణ దేవునిచే ప్రభావితం కావడానికి కలిసి వస్తారు, ఎందుకంటే, "నా నామమున ఎక్కడ ఇద్దరు ముగ్గురో కూడియుందురో అక్కడ నేను వారి మధ్య ఉందును అని ఆయన వాగ్దానం చేశాడు" (మత్తయి 18:20).

సహవాసంలో అసంపూర్ణ వ్యక్తుల గురించి ఆలోచించే బదులు ఆయన సన్నిధిని గుర్తెరగాలి. మనము ఒకరి భారములను ఒకరు భరించుటకు పిలువబడ్డాము, ఈ విధంగా క్రీస్తు నియమమును నెరవేర్చాలి (గలతీ 6:2). ఆయనే మన సహవాసానికి కేంద్రం. ఆయన సహవాసాన్ని నిర్మించడానికి ఆసక్తిగా ఉన్నాడు. మీ వ్యక్తిగత వ్యాపార అభి వృద్ధి కోసం సహవాసాన్ని ఎప్పుడూ ఉపయోగి ంచవద్దు, కానీ ఆయన రాజ్యాన్ని నిర్మించడానికి పాటుపడాలి. యేసు దేవాలయంలో అమ్మేవారిని వెళ్లగొట్టడం ప్రారంభించాడు. "నా మందిరము ప్రార్థన మందిరమని వ్రాయబడియున్నది; అయితే మీరు దానిని దొంగల గుహగా చేసితిరి" అని ఆయన చెప్పెను. ఎక్కడైతే వ్యక్తిగత వ్యాపారాలు ప్రోత్సహించబడతాయో అక్కడ సహవాసాలు విచ్ఛిన్నమవుతాయి.

ఉత్తర కాలిఫోర్నియాలోని రెడ్‌వుడ్ చెట్లు భూమిపై పురాతనమైన, పొడవైన చెట్లు. అవి 300 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పుతో పెరుగుతాయి, 2500 సంవత్సరాల నుండి 4000 సంవత్సరాల వరకు జీవిస్తాయి, కఠినమైన పరిస్థితులను తట్టుకోగలవు. ఎందుకంటే, ఆ చెట్లు ఒకదానితో ఒకటి పెనవేసుకున్న వేళ్ళతో కలిసి పెరుగుతాయి. విశ్వాసులు కలిసి ఎదగడం, కష్ట పరిస్థితులను తట్టుకోవడం ఎంత నిజం! "ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకరినొకరు పురి కొల్పుచు, కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుకొనుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి యెక్కువగా అలాగు చేయుచు హెచ్చరించుదము" అని హెబ్రీయుల పత్రిక చెబుతోంది. ఆయన రాజ్యానికి తోడ్పడుతూ డైనమిక్ సహవాసాన్ని నిర్మిద్దాం. కలిసి ఎదగడం ద్వారా మన జీవితాల్లో దేవుని ఉద్దేశాన్ని నెరవేరుద్దాం.

## ముగింపు

బలమైన వ్యక్తిత్వాలు శక్తివంతమైన క్రైస్తవ సహవాసంలో నిర్మించబడతాయి, మనం అందులో భాగం కావడానికి పిలువబడ్డాం. సహవాసంలో మనలోని లోపాలు సరిదిద్దబడతాయి, ఫలితంగా మనలోని ముతక కోణాలు తొలగించబడతాయి. మనమందరం దిద్దుబాటుకు సిద్ధంగా ఉండాలి. మనమందరం దేవుని పరిశుద్ధతను చేరుకోవడానికి కలిసి పనిచేద్దాం. అదే సహవాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

ఒక వ్యక్తి యొక్క పాపం మొత్తం సహవాసానికి శాపంగా మారవచ్చు. ఆకాను చేసిన పాపం ఇందుకు ఒక ఉదాహరణ. ఆకాను పాపం వలన ఇశ్రాయేలీయులు హాయి పట్టణాన్ని జయించడంలో ఓడిపోయారు. 36 మంది సైనికులు మరణించారు. అందుకే మనమందరం మన సహవాసం కోసం, గ్రాడ్యుయేట్స్, స్టూడెంట్స్, స్టాఫ్ ఏ ప్రభువు శరీరానికి చెందినవారమో, ఆ ప్రభువుకే అంకితమై ఉండాలని ప్రార్థించాలి. ఎందుకంటే, ఆయన మనలను తన రక్తంతో కొన్నాడు (1 కొరింథీ 6: 19-20).

**– సురేష్ అర్జా, హైదరాబాద్**

ప్రోత్సాహం



# సహవాసం

## విశ్వాసికి బలమైన అండదండ

ఒంటరితనం రాజ్యమేలుతున్న ఈ ప్రపంచంలో, సహవాసం విశ్వాసులకు ఒక గొప్ప అండదండగా నిలుస్తుంది. మన కష్టాల్లో, సంతోషాల్లో తోడుగా ఉండేందుకు తోటి విశ్వాసులు ఉన్నారనే భరోసాను ఇస్తుంది. సహవాసం అంటే కేవలం కలిసి భోజనం చేయడం, కబుర్లు చెప్పుకోవడం మాత్రమే కాదు; అది మన ఆత్మీయ ఎదుగుదలకు, విశ్వాసానికి బలమైన పునాది వేసే ఒక దైవిక బంధం.

నా అనుభవాలను గుర్తు చేసుకుంటే, 2000ల ప్రారంభంలో నేను అమెరికాలో ఉన్నప్పుడు భారతీయులు చాలా తక్కువగా ఉండేవారు. ఎక్కడైనా భారతీయులు కనిపిస్తే, ఎంతో సంతోషంగా అనిపించేది. వాళ్లు మన రాష్ట్రం వాళ్లయితే, మన భాష మాట్లాడేవారైతే ఇక అంతే, జీవితాంతం స్నేహితులుగా ఉండిపోయేవారం. పరాయి దేశంలో ఒకరికొకరు అండగా నిలిచేవాళ్లం.

### క్రైస్తవ సహవాస సారాంశం

క్రైస్తవ సహవాసం కూడా ఇలాంటిదే. బైబిల్ మనల్ని ఈ లోకంలో పరదేశులమని, యాత్రికులమని చెబుతోంది. దేవుని పిల్లలుగా మారిన తర్వాత, మనకు ఈ లోకం స్వస్థలం కాదని తెలుస్తుంది. మన ఆత్మీయ ప్రయాణంలో ఈ లోకంలో మనకు ఎవరూ తోడుండరు. కానీ, తోటి విశ్వాసులు మనకు అండగా ఉంటారు. ఇదే క్రైస్తవ సహవాస ముఖ్య ఉద్దేశం.

### సహవాసం గురించి అపోహలు

దురదృష్టవశాత్తు, క్రైస్తవ వర్గాల్లో "సహవాసం" అనే పదాన్ని చాలా తప్పుగా ఉపయోగిస్తున్నారు. "సహవాస విందు", "సహవాస బిర్యానీ" వంటి పదాలను వాడుతున్నారు. ఇది సహవాసం యొక్క నిజమైన అర్థాన్ని నీరుగార్చుతుంది. నిజానికి సహవాసం అంటే విశ్వాసుల మధ్య క్రీస్తును కేంద్రంగా చేసుకుని ఏర్పడే ఒక బలమైన

స్నేహం. ఇద్దరు విశ్వాసుల మధ్య నిజమైన స్నేహమే సహవాసం. దీనికి భోజనానికి ఎలాంటి సంబంధం లేదు. సహవాసం అనేది క్రీస్తుతో క్రైస్తవులు పంచుకునే ఒక పరస్పర బంధం. ఇది మనల్ని ఒకరితో ఒకరిని శాశ్వతంగా కలిపి ఉంచుతుంది.

### ఆది సంఘం: ఆదర్శ సహవాసానికి ఒక ఉదాహరణ

మనం ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ఆత్మీయంగా ఎదగడానికి దేవుడు మనల్ని సహవాసంలో ఉంచాడు. ఆది సంఘం ఆదర్శ సహవాసానికి ఒక గొప్ప ఉదాహరణ. అపొస్తలుల కార్యములు 2:42-47 వచనాల్లో దీని గురించి వివరంగా ఉంది.

* వారందరూ కలిసి ఉండేవారు.
* అపొస్తలుల బోధనలు, ప్రార్థన, రొట్టె విరుచుట ద్వారా దేవునితో సంబంధం కలిగి ఉండేవారు.
* వారికి కలిగినదంతా ఉమ్మడిగా పంచుకునే వారు.
* తమ ఆస్తులను అమ్మి అవసరమైన వారికి ఇచ్చేవారు.
* క్రమం తప్పకుండా కలిసి ప్రార్థనలు చేసేవారు.

అపొస్తలుల బోధనలు, ప్రార్థనలు ఆది సంఘ సహవాసానికి కేంద్ర బిందువులుగా ఉన్నాయి. అందుకే యుఇయస్ఐ ఫోర్ ఫాదర్స్ రెండవ లక్ష్యాన్ని ఇలా నిర్వచించారు: “మనవలె అమూల్య విశ్వాసం గల విద్యార్థులందరితో సహవాసం చేయుట ద్వారా, ముఖ్యంగా వాక్యధ్యానం, ప్రార్థనల ద్వారా క్రైస్తవ జీవితంలో ఒకరికొకరు పరస్పరం సహాయపడుతూ, ఎదుగుతూ క్రీస్తు కొరకు సాక్షులుగా ఉండేలా ప్రోత్సహించుకోవడం.” కాబట్టి, సహవాసం అంటే బైబిల్ పఠనం, ప్రార్థనలో కలిసి ఉండటమే, కానీ విందులు చేసుకోవడం కాదు.

### సహవాసంలో ముఖ్యమైన అంశాలు

మన క్రైస్తవ జీవితంలో సహవాసం అనేది ఒక అదనపు కార్యక్రమం కాదు; అది చాలా అవసరం. సహవాసంలో ఐదు ముఖ్యమైన అంశాలు ఉన్నాయి:

1. **క్రైస్తవులకు సహజమైనది:** సహవాసం క్రైస్తవులకు సహజంగా వస్తుంది. మనమందరం ఒకే ఆత్మతో బంధించబడి ఉన్నాము. కాబట్టి, నిజమైన దేవుని పిల్లలుగా ఒకరినొకరు పంచుకోవడం, శ్రద్ధ చూపడం మనకు సహజంగానే వస్తుంది.
2. **శోధన నుండి రక్షణ:** ఒంటరిగా ఉన్నప్పుడు శోధనకు లొంగిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రసంగి 4:12లో చెప్పినట్లుగా, “మూడు పేటల తాడు తెగదు.” మీరు విద్యార్థి అయితే, మీ చుట్టూ విశ్వాసుల సహవాసం ఉండేలా చూసుకోండి. ఒకరి నుండి ఒకరు నేర్చుకుంటూ, దేవుని వాక్యాన్ని ధ్యానించడానికి ప్రోత్సహించుకోవాలి. చదువులో, ఇతర విషయాల్లో ఒకరికొకరు సహాయం చేసుకోవాలి.
3. **ప్రపంచానికి సాక్ష్యం:** మన ఐక్యత ప్రపంచానికి ఒక గొప్ప సాక్ష్యంగా ఉంటుంది. స్వార్థం, మోసం, ద్వేషం, క్రూరత్వం నిండిన ఈ సమాజంలో మన ఐక్యత, ప్రేమ, ఆనందం, ఒకరి పట్ల ఒకరికి శ్రద్ధ క్రీస్తు వైపు ఇతరులను ఆకర్షిస్తాయి.
4. **దేవుని రాజ్య అనుభవం:** సహవాసం మన జీవితంలో దేవుని రాజ్యాన్ని అనుభవించడానికి అనుమతిస్తుంది. క్రీస్తు రెండవ రాకడ కోసం మనం వేచి ఉండవలసిన అవసరం లేదు; సహవాసం ఆ రాజ్యానికి ఒక చిన్న సూచన.
5. **క్రీస్తు శరీరంలో భాగం:** మనం ఒంటరి వ్యక్తులం కాదు; మన స్థానిక సహవాసాలు క్రీస్తు విశ్వవ్యాప్త శరీరంలో ముఖ్యమైన భాగాలు. మనలో ప్రతి ఒక్కరికీ ఒక పాత్ర ఉంది. మనమందరం కలిసి క్రీస్తు శరీరాన్ని ఆరోగ్యంగా, సమర్థవంతంగా పనిచేయడానికి సహాయం చేస్తాం.

### సమర్థవంతమైన సహవాసం కోసం ఆచరణాత్మక చిట్కాలు

సమర్థవంతమైన సహవాసాన్ని పెంపొందించడానికి ఈ సూచనలను పాటించాలి:

* ఒకరితో ఒకరు పంచుకోవాలి.
* ఒకరి కోసం ఒకరు ప్రార్థించాలి.
* ఒకరి దగ్గర ఒకరు ఒప్పుకోవాలి.
* ఒకరి దగ్గర ఒకరు సలహా పుచ్చుకోవాలి.
* నిజాయితీగా ప్రేమించాలి, ఒకరి పట్ల ఒకరు శ్రద్ధ వహించాలి.
* ఒకరికి ఒకరు సహాయం చేసుకోవాలి.

**నా వ్యక్తిగత అనుభవం**

2021లో నేను కోవిడ్-19 బారిన పడ్డాను. నేను మంచానికే పరిమితమయ్యాను. 45 రోజులు ఐసిఇయూలో ఉన్నాను. నా అవయవాలు పనిచేయడం ఆగిపోయాయి. చావు అంచుల వరకు వెళ్ళాను. కానీ దేవుడు నన్ను కాపాడి స్వస్థపరిచాడు. ఇది దేవుని దయకు నిదర్శనం.

అయితే, నా కుటుంబానికి సహవాసం నుండి లభించిన మద్దతు మరింత గొప్పది. బ్రదర్స్ వైద్యులతో మాట్లాడటానికి, ఆర్థిక వ్యవహారాలు చూసుకోవడానికి, ప్రార్థనలు చేయడానికి ముందుకు వచ్చారు. సిస్టర్స్ నెలరోజులకు పైగా మా కుటుంబానికి భోజనం అందించే బాధ్యత తీసుకున్నారు. ఈ శారీరక, ఆధ్యాత్మిక మద్దతు, భయం లేకుండా ఆ కష్టాన్ని ఎదుర్కోవడానికి సహవాసం మాకు సహాయపడింది. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి దేవుడు మనకు తోటి విశ్వాసులను అనుగ్రహించాడు.

**సహవాసం అనే బహుమానాన్ని స్వీకరించడం**

సహవాసం అనేది కేవలం ఒక సామాజిక బాధ్యత మాత్రమే కాదు, మన ఆధ్యాత్మిక జీవితంలో ఒక ముఖ్యమైన భాగం అని గుర్తెరిగి, ఈ బహుమానాన్ని స్వీకరిద్దాం. మన ఎదుగుదల కోసం, ప్రోత్సాహం కోసం దేవుడు ఏర్పాటు చేసిన ఒక దివ్యమైన ఏర్పాటు ఇది. ఒకరితో ఒకరికి ఉన్న సంబంధాల ద్వారా ఆయన ప్రేమను, కృపను మనం పూర్తిగా అనుభవించవచ్చు. సహవాసంలో మనం కలిసి వచ్చినప్పుడు, మన బాధలను పంచుకోవడానికి, మన విజయాలను జరుపుకోవడానికి, మన విశ్వాసంలో ఎదగడానికి ఒక వాతావరణాన్ని ఏర్పరుచుకుంటాం.

**సహవాసంలో ఉద్దేశపూర్వకంగా పాల్గొనడం**

మనం సహవాసంలో పాల్గొన్నప్పుడు, మనం ఉద్దేశపూర్వకంగా ఉండాలని గుర్తుంచుకోవాలి. కేవలం సమావేశాలకు హాజరైతే సరిపోదు; తోటి విశ్వాసుల జీవితాల్లో చురుకుగా పాల్గొనాలి. అంటే, ఒకరినొకరు చేరుకోవడం, మద్దతు ఇవ్వడం, ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడటం. సంతోషకరమైన, కష్ట సమయాల్లో తోడుండటం. ఆది సంఘం ఎలా చేసిందో అలా మనం కూడా చేయాలి.

**వ్యక్తిగత ధోరణిని ఎదుర్కోవడం**

నేటి ప్రపంచంలో చాలామంది వ్యక్తిగత ధోరణిని, స్వయం సమృద్ధిని ప్రోత్సహిస్తారు. కానీ మనం సహవాసం, పరస్పర సహకారం కలిగి ఉండటం ద్వారా దాన్ని ఎదుర్కోవాలి. ఒకరి భారాన్ని ఒకరు మోస్తూ (గలతీయులు 6:2), ప్రతిరోజు ఒకరినొకరు ప్రోత్సహించుకోవాలని (హెబ్రీయులు 3:13) దేవుడు మనల్ని పిలుస్తున్నాడు. ఇదే సహవాస సారాంశం. విశ్వాసంలో ఒకరితో ఒకరు కలిసి నడవడానికి కట్టుబడి ఉండటమే సహవాసం.

**మన సహవాసం గురించి ఆలోచించాలి**

మన జీవితాలను మనం పరిశీలించుకుంటే, ఇతరులతో మన సహవాసాన్ని ఎలా మెరుగుపరుచుకోవచ్చో ఆలోచించాలి. మన సహవాసంలో మద్దతు, ప్రోత్సాహం అవసరమైన వారు ఎవరైనా ఉన్నారా? క్రీస్తును గౌరవించే అర్థవంతమైన సంబంధాలను ఏర్పరచుకోవడానికి మన సుఖ వలయాల నుండి బయటకు రావడానికి మనం సిద్ధంగా ఉన్నామా?

**ముగింపు**

సహవాసం అనేది విశ్వాసులకు ఒక శక్తివంతమైన మద్దతు వ్యవస్థ. జీవితంలోని సవాళ్లను ఎదుర్కోవ డానికి అవసరమైన బలాన్ని, ప్రోత్సాహాన్ని ఇది మనకు అందిస్తుంది. ఇది ఆత్మీయ ఎదుగుదలను, విశ్వాసుల మధ్య ఐక్యతను పెంపొందించే ఒక దైవిక బంధం. ఒకరినొకరు ప్రోత్సహించుకోవడానికి, దేవుని మహిమపరచడానికి దేవుడు మనకు ఇచ్చిన సంబంధాలను ఉపయోగించుకుంటూ సహవాసానికి మనల్ని మనం పునరంకితం చేసుకుందాం. మనమందరం కలిసి

క్రీస్తు ప్రేమను ప్రతిబింబించే ఒక శక్తివంతమైన సహవాసాన్ని సృష్టిద్దాం. ఈ లోకానికి ఒక ఆశా జ్యోతిగా ఉందాం.

కాబట్టి, ముందుకు సాగతూ తోటి విశ్వాసులను చేరుకుందాం. ప్రేమ బంధాలు, సహాయం వృద్ధి చెందేలా తోడ్పడదాం. అలా చేయడం ద్వారా ఆధ్యాత్మిక జీవితాన్ని మెరుగుపరచుకోవడమే కాకుండా, క్రీస్తు శరీర ఆరోగ్యానికి, శక్తికి దోహదం చేస్తాం. మనమందరం కలిసి శాశ్వతమైన ప్రభావాన్ని చూపగలం. ఈ ప్రపంచానికి సహవాసం ఎంత ముఖ్యమో నిరుపిస్తూ ఒక ప్రకాశవంతమైన నిదర్శనంగా వెలుగుతూ ఉండగలం.

**– హెర్బర్ట్ జోస్**
**హెచ్‌సీయూ జోన్, సైబరాబాద్**

* * * * * *

# కన్నీటితో ప్రార్థిద్దాం



**తె**లంగాణలో దేవుడు చేస్తున్న అద్భుతమైన కార్యాలను, అనేకమంది విద్యార్థుల రక్షణకు సంబంధించిన గొప్ప కార్యాలను గ్రాడ్యుయేట్ పెద్దలు చెబుతుంటే, ఆ ప్రార్థన సమావేశంలో ఉన్నవారందరూ దేవునికి స్తుతులు చెల్లించారు.

ఆ సమయంలో ఒక పెద్దన్న కొన్ని ముఖ్యమైన విషయాలను లేవనెత్తారు. ఈ మధ్యకాలంలో మన ఇజియఫ్‌లలో రియల్ ఎస్టేట్ గురించి, ఇళ్ళు కొనడం గురించి ఫెలోషిప్ తర్వాత ఎక్కువగా మాట్లాడుతున్నారని, అది మంచిది కాదని, ఈ ధోరణి మారేలా మనమందరం ప్రార్థించాలని కోరారు.

ఇల్లు, స్థలం చెడ్డ విషయాలు కాకపోవచ్చు, కానీ అలాంటి విషయాల గురించి మాట్లాడేటప్పుడు సొంత ఇల్లు లేని గ్రాడ్యుయేట్లు కూడా మన మధ్యలో ఉంటారని గుర్తుంచుకోవాలి. మన మాటల వల్ల ఎవరికీ బాధ కలగకుండా చూసుకోవాలి. మనది ఆత్మీయ సహవాసం. విద్యార్థుల గురించిన తపన తప్ప, లోక సంబంధమైన విషయాలేవీ మన మధ్యలో రాకుండా ప్రార్థించాలి. గ్రాడ్యుయేట్స్‌గా మనమందరం విద్యార్థులను శిష్యులుగా చేయడానికి, వారికి చక్కగా కౌన్సిలింగ్ ఇవ్వడానికి సహాయపడేలా ప్రార్థిద్దామని అన్న ఎంతో భారంతో చెప్పారు.

అప్పుడు ఒక తమ్ముడు స్పందిస్తూ, “అన్నా, ఇవన్నీ మనకు తెలిసినా మనలో మార్పు రావడం లేదు, కార్యం జరగడం లేదు” అని తన బాధను వ్యక్తం చేశాడు. దానికి ఆ పెద్దన్న బదులిస్తూ, “మన ప్రభువు చెప్పినట్లు ఉపవాసం ఉండి, మన గ్రాడ్యుయేట్స్ పరిచర్య కోసం ప్రార్థిద్దాం తమ్ముడు” అన్నారు.

కన్నీటి ప్రార్థన ఉజ్జీవానికి దారి తీస్తుంది. ఒకసారి తనతోటి పరిచారకులు పరిచర్యలో వారు నేర్చుకున్న అన్ని పద్ధతులు అవలంభించినప్పటికీ ఫలితం రానప్పుడు, విలియం బూత్ దగ్గరికి వచ్చి అడిగితే, ఆయన “కన్నీళ్ళతో ప్రార్థన” చేయమని చెప్పాడు. ఆశ్చర్యకరంగా, అద్భుతమైన కార్యాలు జరిగాయి. కాబట్టి, మనం కూడా మన పరిచర్య కోసం, గ్రాడ్యుయేట్స్ కోసం, విద్యార్థుల కోసం, స్టాఫ్ కోసం ఆయన కృపాసనం దగ్గర చేరి కన్నీటి ప్రార్థన చేద్దాం. కన్నీటితో చేసే ప్రార్థన దేవుని హృదయాన్ని కదిలిస్తుంది.

“కన్నీళ్లు విడుచుచు విత్తువారు సంతోషగానముతో పంట కోసెదరు.” కీర్తనలు 126:5. ఈ వాగ్దానం మనకు గొప్ప ప్రోత్సాహాన్నిస్తుంది. కన్నీళ్లతో విత్తనాలు విత్తేవారు సంతోషంతో పంటను కోస్తారు. కాబట్టి, మనమందరం కన్నీటితో ప్రార్థిద్దాం. దేవుడు మన రాష్ట్రంలో గొప్ప కార్యాలు జరిగించేలా మనల్ని మనం సమర్పించుకుందాం.

**– దాసరి రాజేష్**

అవగాహన

# క్యాంపస్‌ను దేవుని కళ్ళతో చూడటం

## విద్యార్థిగా దేవుని సేవ



జీవితం అనేది అద్భుతమైన ప్రయాణం! ప్రతి క్షణమూ ఒక అమూల్యమైన అనుభవం. ప్రతి అవకాశం, ప్రతి సవాల్ మనల్ని మరింత బలపరుస్తాయి. ఈ అనుభవాల సముద్రంలో, కళాశాల కాలం అనేది ఒక ప్రత్యేకమైన అధ్యాయం. ఇది విద్యార్థుల జీవితంలో ఒక మలుపు, ఒక శిఖరం. ఈ కాలంలో, విజ్ఞానం సంపాదించడమే కాదు, మన భవిష్యత్తును నిర్మించుకోవడానికి అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి.

కానీ, ఈ అమూల్యమైన కాలాన్ని విద్యార్థి పరిచర్యకు కూడా అంకితం చేయవచ్చునని మీకు తెలుసా? మీ కళాశాల క్యాంపస్‌ను మీ మిషన్ ఫీల్డ్‌గా మార్చుకోవచ్చునని ఎప్పుడైనా ఆలోచించారా?

### కళశాల క్యాంపస్: మన మిషన్స్ ఫీల్డ్

నేను విద్యార్థిగా ఉన్న రోజుల్లో లింగారెడ్డితో మాట్లాడిన విషయాలు ఎప్పటికీ మర్చిపోలేను. మేము అప్పుడే రక్షించబడ్డాం. ప్రభువులో మొదటి అడుగులు వేస్తూ నడుస్తున్న రోజులవి. ఆ రోజుల్లోనే లింగారెడ్డి వాళ్ళ అక్క తనతో అన్న మాటలు ఏంటంటే “తమ్ముడు మీ జోన్‌కి నువ్వే మిషనరీవి. నీ కాలేజ్‌కి నువ్వే మిషనరీవి”. ఈ మాటలు నన్నెంతో ఆలోచింప జేసాయి. దేవుని సేవను నేను ఎక్కడికో వెళ్లి చేయాల్సిన అవసరం లేదు, నా కాలేజీలోనే దేవుని సేవను చేయవచ్చు అనే విషయం నాకు అప్పుడు అర్థమైంది. బాధాకరమైన విషయం ఏంటంటే



“ క్రీస్తు ప్రభువు ఇచ్చిన మహా ఆదేశం (గొప్ప ఆజ్ఞ) ప్రతి విశ్వాసికి ఉన్న వ్యక్తిగత బాధ్యత అంటాడు స్టీవ్ షడ్రక్.

నేడు కొంతమంది విద్యార్థులు ఏదైనా సుదూర ప్రదేశానికి వెళ్లి అక్కడ పరిచర్య చేస్తేనే అది మిషన్స్ వర్క్ అని అనుకుంటున్నారు. ఇది సరైన అవగాహన కాదు. ఎక్కడ ఉన్నవారు అక్కడే దేవుని పని చేయడం కూడా మిషన్ వర్క్‌లో ప్రాముఖ్యమైన భాగం. దేవుని వాక్యంలో ఇదే చూస్తాం (అపో. కార్య. 18:1-3, 18-19,26; రోమా 16:3-4). ప్రత్యేకంగా ప్రతి విద్యార్థికి తన సొంత కళాశాల క్యాంపసే మిషన్ ఫీల్డ్. ఇలా దేవుని దృష్టితో క్యాంపస్‌ను చూడాలి.

## కళాశాలలో మన బాధ్యత

సాధారణంగా ఒక విశ్వాస విద్యార్థిని “ఈ కాలేజీలో ఎందుకు చదువుకుంటున్నావ్?” అని ప్రశ్నిస్తే, “బాగా చదువుకోవడానికి,” “మంచి ఉద్యోగం సంపాదించడానికి” అనే జవాబు వస్తుంది. మంచిదే. తప్పులేదు. కానీ, చక్కగా చదువుకోవడం, ఉద్యోగం సంపాదించడంతో పాటు దేవుని సాక్షిగా ఉండటం అవసరమని గుర్తించాలి. కళాశాలలో ఆయన రాజ్య విస్తరణ కోసం మనలను దేవుడు అక్కడ పెట్టాడనే గ్రహింపు కలిగియుండడం వాక్యానుసారం. గొప్ప ఆజ్ఞలో (మత్తయి 28:19, మార్కు 16:16) సర్వసృష్టికి సువార్త ప్రకటించమన్నప్పుడు అందులో కళాశాల ప్రాముఖ్యమైనది. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు నిర్ణేతలు. వారి ఆలోచనల్లో, భావజాలంలో క్రీస్తు సువార్త పరిమళం వెదజల్లబడాలంటే విద్యార్థి దశలోనే వారి మనసులో ఆయన రాజ్యపు విలువలు నాటబడాలి. అప్పుడు అవి లోతుగా వేరు పారి ఫలించి అభివృద్ధి చెంది సమాజంలో దేవుని రాజ్యపు ఫలాలు కోయడానికి దోహదపడతాయి. అంతేకాదు, నేడు నేను ఓ కళాశాల విద్యార్థిగా ప్రభువు ఉద్దేశాన్ని ఎలా నెరవేర్చగలను అని వాక్యానుసారంగా ఆలోచిస్తే దేవుని రాజ్యాన్ని, ఆయన నీతిని వెతకాలి అనే జవాబు మనం పొందుకుంటాం (మత్తయి 6:33). కాబట్టి, చదువుల్లో రాణిస్తూనే విద్యార్థులుగా గొప్ప ఆజ్ఞను నెరవేర్చాలన్నదే సమగ్రమైన దృక్పథం. అందువలన కళాశాలలోని సహ విద్యార్థులను వారి పోకడలను నిశితంగా గమనించాలి. మనం మంచి విద్యను పొందడమే కాకుండా, మన చుట్టూ ఉన్నవారికి దేవుని ప్రేమను చూపించాలి.

## కళాశాలలోని వ్యక్తులు – మన ప్రభావం

ఆ క్రమంలో కళాశాల విద్యార్థులందరినీ రెండు రకాలుగా మనం విభజించి చూడవచ్చు. మొదటి రకం విద్యను, జీవితాన్ని విలువైనదిగా ఎంచి చక్కగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ క్రమశిక్షణ కలిగి మెలుగుతారు. రెండవ రకంవారు గురి గమ్యం లేక వ్యసనాలకు బంధి అయ్యి వాటికి బానిసలుగా ఉంటారు. విద్యార్థులతో పాటు కళాశాలలో ఉండే మరొక ప్రధానమైన గుంపు అధ్యాపకులు, సిబ్బంది. వీరందరికీ సువార్త సమానంగా అవసరం. క్రీస్తు సువార్త విలువలే ప్రతి ఒక్కరి జీవితంలోని ప్రధాన సమస్య పాపం అని గుర్తించడానికి దోహదపడతాయి. తదుపరి ఈ ప్రధాన సమస్యకు పరిష్కారం యేసుక్రీస్తు మరణంలోనే ఉందని వారు గ్రహించడానికి సహ విద్యార్థులే సహాయపడగలరు. వారికి యేసుక్రీస్తు సువార్తను పరిచయం చేయడమే మిషన్ వర్క్. క్రీస్తు ప్రభువు ఇచ్చిన మహా ఆదేశం (గొప్ప ఆజ్ఞ) ప్రతి విశ్వాసికి ఉన్న వ్యక్తిగత బాధ్యత అంటాడు స్టీవ్ షడ్రక్.

## మహా ఆదేశం: వ్యక్తిగత బాధ్యత

మహా ఆదేశానికి నీవు వ్యక్తిగత బాధ్యత తీసుకున్నావా లేదా అని ఎలా చెప్పగలం? సింపుల్. మహా ఆదేశంలో నీ పాత్రను నెరవేర్చడానికి నీకు ఒక ప్రణాళిక ఉంటుంది. బహుశా నీ చదువులు, నీ ఆర్థిక వ్యవహారాలు, నీ వ్యాయామం, నీ భవిష్యత్తు, నీ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన బాధ్యతను తీసుకున్నావు అనుకుందాం. నీవు పూర్తి బాధ్యత తీసుకున్నావని నీకు ఎలా తెలుస్తుంది? నీకు ఈ విషయాలలో ప్రతిదానికీ ప్రణాళిక ఉంటుంది. ఇంకా నీవు వాటిని సాధించడానికి శ్రద్ధగా కృషి చేస్తావు. అలాగే మహా ఆదేశం పాటించి నెరవేర్చడానికి ప్రతి విశ్వాస విద్యార్థి వ్యక్తిగత ప్రణాళిక కలిగియుండాలి. కాబట్టి, మన కళాశాల జీవితంలో మనం దేవుని సేవకు ప్రణాళికతో ముందుకు సాగాలి.

## ప్రార్థన – ప్రణాళిక మూలస్తంభం

ఈ ప్రణాళికలో అతి ముఖ్యమైన అంశం ప్రార్థన. వ్యక్తిగత ప్రార్థనతో పాటు, సమూహ ప్రార్థన కూడా అత్యంత ముఖ్యం. ప్రభువుకు మన అభ్యర్థనలు తెలియజేయడమే కాకుండా, మన ప్రార్థనలకు అవసరమైన సమాచారాన్ని కూడా సేకరించాలి. ప్రభువు మనకు అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని, సహజమైన సంభాషణల (Conversational Evangelism) ద్వారా మన విశ్వాసాన్ని, క్రీస్తులో మన అనుభవాన్ని ఇతరులతో పంచుకోవాలి. జీవనశైలి ద్వారా సువార్తను ప్రకటించడం (Lifestyle Evangelism) కూడా చాలా ప్రభావవంతమైన మార్గం. ఏ పద్ధతిని అవలంబించినా, ప్రార్థనతో పాటు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం చాలా ముఖ్యం.

## స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు

స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించడానికి కృషి చేయాలి. లక్ష్యాలు నెరవేరినప్పుడు, ప్రభువును స్తుతించాలి. నెరవేరని లక్ష్యాల కోసం నిరంతరం ప్రార్థన చేయాలి.

## శిష్యత్వం: దీర్ఘకాలిక ఫలాలకు మార్గం

సువార్తను పంచుకోవడంతో పాటు, శిష్యత్వం కూడా అంతే ప్రాముఖ్యత కలిగి ఉంది. వ్యక్తిగతంగా శిష్యత్వపు జీవితాన్ని కలిగి ఉండటంతో పాటు, మనతో చుట్టూ ఉన్నవారిని కూడా శిష్యత్వపు విలువలతో జీవించడానికి ప్రోత్సహించాలి. ఈ విషయంలో కూడా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, మన పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. ప్రభువు శిష్యత్వంలో ఎదిగిన వారే భవిష్యత్తులో ఆయన సువార్తను స్థిరంగా ఆచరించగలరు. శిష్యత్వమే దీర్ఘకాలిక ఫలితాలను ఇస్తుంది. కాబట్టి, ఒక విద్యార్థి మరొక విద్యార్థిని శిష్యత్వంలో ప్రోత్సహించాలి. ఇదే గొప్ప ఆజ్ఞ సారాంశం.

సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించడం సులభం, అయితే ఇతర సహవిద్యార్థులు, సీనియర్ విద్యార్థులు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావచ్చు. ప్రార్థనతో కూడిన వినయంతో వ్యవహరిస్తే, పెద్దలు, చిన్నవారు అనే తేడా లేకుండా, దేవుడు ఒకరి ద్వారా మరొకరిని నిర్మించి స్థిరపరుస్తాడు. బిల్ బ్రైట్ చెప్పినట్లు, "మహా ఆదేశాన్ని నెరవేర్చడం కంటే గొప్ప ఆధిక్యత మరొకటి లేదు." కాబట్టి, మన కళాశాలను దేవుని కన్నులతో చూసి, ఈ గొప్ప ఆధిక్యతను బాధ్యతాయుతంగా నెరవేరుద్దాం.


**Bibliography**

1. Steve Shadrach, and Paul Worcester. The Fuel & the Flame: Ignite Your Life & Your Campus for Jesus Christ. CMM Press, 2021.


– సందీప్ రాజ్ లంక
జేఏన్‌టీయూ ఏరియా జోన్



# దేవుని డిజిటల్ స్వరమా?

కాలం మారుతోంది, అందుకు అనుగుణంగా మానవ జీవనశైలి కూడా మారుతోంది. నేటి డిజిటల్ యుగంలో మనిషి కూడా డిజిటల్‌గా మారాడన్నది సత్యం. ఈ కొత్త నాగరికతలో మొబైల్ లేని మనిషి లేడు, మొబైల్ అవసరం లేని రోజు లేదు. ఎంత విచిత్రం! ఇప్పుడు ఎక్కువ మంది బైబిల్ చదవడానికి కూడా మొబైల్‌నే ఎక్కువగా వాడుతున్నారు. తెలియని విషయాలు తెలుసుకోవడానికి, బైబిల్‌కు సంబంధించిన చారిత్రక సత్యాలు అర్థం చేసుకోవడానికి మొబైల్ అవసరమే. కానీ, ఈ సందర్భంలో దేవుని మెల్లనైన స్వరాన్ని వినడం ఎలా? అది డిజిటల్ స్వరమా లేక బైబిల్ స్వరమా? గుర్తించడం ఎలా?

**డిజిటల్ ప్రపంచం: దేవుని స్వరం ఎక్కడ ఉంది?**

నేటి వేగవంతమైన సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో, మనం వివిధ రకాల ధ్వనులతో నిరంతరం మునిగి తేలుతున్నాం. ఈ ధ్వనుల మధ్య దేవుని స్వరాన్ని గుర్తించడం అనేది ఒక పెద్ద సవాలు. డిజిటల్ ప్రపంచం అనేక రకాల ధ్వనులతో నిండి ఉంది. వాట్సాప్, యూట్యూబ్, ఫేస్‌బుక్ రీల్స్ వంటి వేదికల ద్వారా అనేక సందేశాలు మనకు అందుతాయి. ఈ సందేశాలలో దేవుని స్వరం ఏమిటి, దేవుడు మనతో ఎలా మాట్లాడుతాడు అనేది గుర్తించడం చాలా ముఖ్యం. లేకపోతే, దేవుడు బైబిల్ ద్వారా కాకుండా, వాట్సాప్, యూట్యూబ్ లేదా ఫేస్‌బుక్ ద్వారా మాట్లాడాడని అనుకునే ప్రమాదం ఉంది.

ఒక విశ్వాసి దేవుడు తనతో మాట్లాడాడని చెప్పడానికి రెండు ప్రధాన సందర్భాలు ఉన్నాయి: (1) సిద్ధపాటు హృదయంతో బైబిల్ చదువుతున్నప్పుడు



**ఖాళీ సమయాన్ని బైబిల్ చదవడం, ప్రార్థన చేయడం కంటే, మొబైల్ ఫోన్ చూడటం, యూట్యూబ్‌లో వాక్యం వినాలనే ప్రేరణ ఎక్కువతుంది.**

లేదా ధ్యానిస్తున్నప్పుడు (2) సిద్ధపాటు హృదయంతో వాక్య సందేశం వింటున్నప్పుడు. కానీ, "దేవుడు ఆన్‌లైన్ ద్వారా నాతో మాట్లాడాడు" అని చెప్పడం అనేది అదనపు అంశం. ఇక్కడ మనకు దేవుడు ఇచ్చిన వివేచన చాలా అవసరం. ప్రణాళిక ప్రకారం నిర్వహించబడిన ఆన్‌లైన్ కార్యక్రమాలకు సిద్ధపాటుతో హాజరవడం మంచిది. ఆ కార్యక్రమాల స్పీకర్స్ ద్వారా మనతో దేవుడు మాట్లాడవచ్చు. కానీ, వాట్సాప్ స్టేటస్‌లు చూడటం, యూట్యూబ్‌లో అనామక బోధనలను వినడం ద్వారా దేవుడు తన స్వరాన్ని వినిపించాడు అనడం అవివేకం. ఇది డిజిటల్ ధ్వని. డిజిటల్ ధ్వనికి, దేవుని మెల్లనైన స్వరానికి మధ్య తేడా గ్రహించకపోతే, ఈ డిజిటల్ ప్రపంచంలో మనం కొట్టుకుపోతాం.

### డిజిటల్ ధ్వని - దాని ప్రభావం

"దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనీయక సద్వినియోగము చేసుకొనుచు, అజ్ఞానుల వలే కాక జ్ఞానుల వలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూసుకోండి" అని పౌలు ఆనాడే ఎఫెసీయులను హెచ్చరించాడు (ఎఫెసి 5:15,16). ఈ హెచ్చరికను మనలో ఎంతమంది పాటిస్తున్నాం? చాలామంది చర్చికి వెళ్లే అవకాశం లేక, లేదా అవకాశం ఉన్నప్పటికీ పోకుండా, ఆన్‌లైన్‌లోనే వాక్యం వింటున్నారు. ఇంట్లోనే కూర్చుని ఆన్‌లైన్ ద్వారా ఆరాధన చేయడం ఎంత విచారకరం! అలాంటి వారితో ప్రభువు ఎలా మాట్లాడగలడు? ఈ డిజిటల్ ప్రపంచం చాలా విషయాలకు ప్రత్యామ్నాయంగా మారింది. ఖాళీ సమయాన్ని బైబిల్ చదవడం, ప్రార్థన చేయడం కంటే, మొబైల్ ఫోన్ చూడటం, యూట్యూబ్‌లో వాక్యం వినాలనే ప్రేరణ ఎక్కువతుంది. డిజిటల్ ప్రపంచం మనలను ఎంతగా ప్రభావితం చేస్తుందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. అందుకే మనం ఆన్‌లైన్‌లో అనేక రకాల స్వరాలు, ధ్వనులను వినవలసి వస్తుంది. వివేచనతో వాటిని వడపోసి, దేవుని స్వరాన్ని గుర్తించే ప్రయత్నం చేయాలి.

### దేవుని స్వరం

దేవుని స్వరాన్ని వినడానికి మన పితరులు మనకు నేర్పిన మాదిరి "మౌనధ్యాన సమయం" మరియు "వ్యక్తిగత బైబిల్ పఠనం." ఈ రెండూ ఏకాంత సమయాల్లో చేయాల్సినవి. రాజైన దావీదు కూడా ఈ అభ్యాసాన్ని అనుసరించాడు. "యెహోవా ధర్మశాస్త్రము నందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు" (కీర్తన 1:2) అని అన్నాడు. "నేను వేకువనే లేచెదను" (కీర్తన 57:8) అంటూ దేవుని స్వరాన్ని వినడానికి తన సంసిద్ధతను చూపించాడు. ఏ సందర్భంలోనైనా, ఏ సమస్యలోనైనా, "దావీదు యెహోవా యొద్ద విచారణ చేయగా," దేవుడు తన మెల్లని స్వరంతో మాట్లాడి, ఆయనను నడిపించాడని మనం చూస్తాం (2 సమూ 5:23). దేవుడు ప్రతిరోజూ తన పిల్లలతో తన వాక్కు ద్వారా మాట్లాడతాడు. కానీ మనం ఆ స్వరాన్ని వినకపోతే, గ్రహించకపోతే, మన పట్ల ఆయన సంకల్పాన్ని అర్థం చేసుకోలేం. అప్పుడు మన ఆధ్యాత్మిక జీవితం యాంత్రికంగా మారిపోయే ప్రమాదం ఉంది.

### దేవుని స్వరాన్ని విన్న భక్తులు

**1. మోషే (నిర్గమ 3, 4 అధ్యాయాలు)**

దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించడానికి మోషేను ఎన్నుకున్నాడు.

గొర్రెల మందను మేపుతున్న మోషేను చూసి, "మోషే మోషే" అని దేవుడు పిలిచాడు. మోషే "చిత్తము ప్రభువా" అని ప్రతిస్పందించాడు. దేవుడు తన వాక్కు ద్వారా మోషేను ఎందుకు పిలిచాడో వివరించాడు. మోషే తన సందేహాలను దేవుని ముందుంచి, సంపూర్ణ విధేయత చూపించాడు. దేవుడు తన స్వరాన్ని వినిపిస్తూ, మోషే ద్వారా గొప్ప కార్యాలు చేసి, ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించాడు.

**2. పౌలు (అపో. కార్య. 9వ అధ్యాయం)**

దేవుని ఎరుగని సౌలు, "సౌలా సౌలా నీవేల నన్ను హింసించుచున్నావని" ఒక స్వరాన్ని విన్నాడు. తనతో ప్రయాణించేవారు కూడా ఆ స్వరాన్ని విన్నారు, కానీ వారు గ్రహించలేదు. కానీ పౌలు "ప్రభువా నీవు ఎవడవు?" అని అడిగి, తాను హింసించుచున్న యేసు అని గ్రహించాడు. ఇది వివేచన, విధేయతకు ఉదాహరణ. ఆ క్షణం నుండి, పౌలు ప్రభువు స్వరాన్ని గ్రహిస్తూ, ఆయన చూపిన మార్గంలో జీవించి, దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చాడు.

బైబిల్లో అనేకమంది భక్తులు దేవుని స్వరాన్ని విని, వివేచనతో గ్రహించి, విధేయత చూపించి, దేవుడు కోరిన జీవితాలను జీవించారు. నేటి డిజిటల్ యుగంలో ఉన్న అనుకూల పరిస్థితుల కంటే, ఆనాటి అనాగరిక కాలంలో ప్రతికూల పరిస్థితులే ఎక్కువ. అయినా, వారు నిశ్శబ్ద వాతావరణంలో దేవుని స్వరాన్ని విని, విజయం సాధించారు.


**డిజిటల్ యుగం – తగు జాగ్రత్తలు**

- **భావోద్వేగాలు వర్సెస్ ఆధ్యాత్మిక ప్రేరణ:** మన భావోద్వేగాలను ఆధ్యాత్మిక ప్రేరణలుగా పొరబడ కుండా జాగ్రత్త వహించాలి. భావోద్వేగాలు తాత్కాలికం, బాహ్య పరిస్థితుల ప్రభావం కలిగి ఉంటాయి. ఆధ్యాత్మిక ప్రేరణలు శాశ్వతమైనవి, దేవుని నుండి వస్తాయి. ఈ రెండింటి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడానికి, మన హృదయాలను పరిశీలించుకోవాలి, దేవుని వాక్యం ఆధారంగా మన అనుభవాలను విశ్లేషించుకోవాలి.
- **నిశ్శబ్దాన్ని సృష్టించుకోవడం:** దేవుని స్వరాన్ని వినడానికి, మన జీవితంలో నిశ్శబ్దాన్ని సృష్టించుకోవాలి. ప్రార్థన, బైబిల్ పఠనం ద్వారా మనం దేవునితో కనెక్ట్ అవ్వచ్చు.
- **ఆన్‌లైన్ సమాచారం:** ఆన్‌లైన్‌లో అనేక రకాల సమాచారం ఉంటుంది, అంతా నిజం కాదు. ఆన్‌లైన్‌లో కనిపించే వ్యక్తులు, సమాచార మూలాల గురించి వివేచన అవసరం. నమ్మదగిన మూలాలను వెతకాలి.
- **ప్రసిద్ధ సంస్కృతి:** ప్రసిద్ధ సంస్కృతి, మీడియా మన ఆలోచనలను ప్రభావితం చేస్తాయి. మనం చూసే, వినే వాటి గురించి జాగ్రత్త వహించాలి. ప్రతి సందేశాన్ని లేఖనాల ద్వారా ఫిల్టర్ చేయాలి.

**ముగింపు**

నేటి డిజిటల్ వసతులు మనకు ప్రభువు అనుగ్రహించినవే, కానీ వాటిని సద్వినియోగం చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ వసతులను దుర్వినియోగం చేయకుండా, మన ఆధ్యాత్మిక జీవితాన్ని బలోపేతం చేసుకోవడానికి ఉపయోగించాలి. దేవుని స్వరాన్ని వినడం, ఆయన సంకల్పాన్ని అర్థం చేసుకోవడం, వివేచనను పెంపొందించుకోవడం కోసం మనం నిరంతరం ప్రయత్నించాలి. ఇది అంత సులభం కాదు, కానీ అది మన జీవితంలో విలువైనది. దేవుడు మనలను నడిపించడానికి, మన జీవితాల్లో ఆయన సంకల్పాన్ని నెరవేర్చటానికి ఆయన స్వరాన్ని వినడం చాలా అవసరం. ఈ డిజిటల్ యుగంలో, మనం దేవుని స్వరాన్ని వినగలుగుతున్నామా? జరభద్రం!

**– డి.రాము, ములుగు**



# ఆత్మీయ నిద్ర

ఒక చల్లని సాయంత్రం, ఒక మూడు అంతస్తుల భవనంలో ప్రార్థన సమావేశం జరుగుతోంది. గ్రాడ్యుయేట్లు, సీనియర్స్ ఎంతో ఆసక్తిగా పాల్గొన్నారు. మంచి స్పీకర్‌ను ఇన్వైట్ చేశారు, అందరూ శ్రద్ధగా వాక్యం వింటున్నారు. ఇంతలో ఒక విద్యార్థి అక్కడికి వచ్చాడు. మిగతావాళ్లలా కాకుండా ఒంటరిగా కిటికీ దగ్గర కూర్చున్నాడు.

అతనికి వాక్యం వినడం బోర్ కొట్టినప్పుడల్లా కిటికీలోంచి బయటకు చూసేవాడు. మళ్ళీ విసుగు వస్తే వాక్యం వైపు చూసేవాడు. అతను ఇయు విద్యార్థే అయినప్పటికీ, వాక్యం అతనికి బోరింగ్‌గా అనిపించింది. చుట్టూ ఉన్న ప్రపంచం కూడా ఆసక్తికరంగా అనిపించలేదు. స్పీకర్ ఎంతో ఆవేశంగా వాక్యం ప్రసంగిస్తున్నా, ఆ విద్యార్థి మాత్రం నిద్రలోకి జారుకున్నాడు. కారణం ఏమిటంటే, అతను ప్రతిరోజు అర్ధరాత్రి పదకొండు, పంద్రెండు గంటల వరకు మొబైల్ ఫోన్‌లో మునిగి తేలతాడు. కొద్దిసేపటికి, నిద్రభారం వల్ల కళ్ళు మూతపడటంతో మూడో అంతస్తు నుండి కిందకు పడిపోయాడు.

అందరూ భయంతో కేకలు వేస్తూ కిందకు పరిగెత్తారు. స్పీకర్ వెంటనే ప్రసంగం ఆపేసి, కిందకి వచ్చి చూశాడు. ప్రశాంతంగా, “తొందర పడకండి, ఇంకా అతనికి ప్రాణం ఉంది! దేవుని కృప అతనిపై ఉంది!” అని ధైర్యం చెప్పాడు. అక్కడికి చేరిన వారందరూ ఆ విద్యార్థి కోసం ప్రార్థించారు. అద్భుతంగా, ప్రార్థించిన వెంటనే ఆ విద్యార్థి స్పృహలోకి వచ్చాడు. అక్కడ ఉన్నవారందరూ, ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఆశ్చర్యపోయారు. ఒకరినొకరు ఆదరించుకొని, ప్రోత్సహించుకున్నారు. దేవుని కృపతో, అతను తిరిగి స్వస్థత పొందాడు.

ఈ సంఘటన మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని తెలియజేస్తుంది: ఆత్మీయ నిద్ర ప్రమాదం, మెలకువగా ఉండటం ప్రాముఖ్యం.

### ఆత్మీయ నిద్ర అంటే ఏమిటి?

ఆత్మీయ నిద్ర అంటే ఆధ్యాత్మికంగా మెలకువగా లేకపోవడం. మన చుట్టూ ఉన్న ఆధ్యాత్మిక విషయాల పట్ల శ్రద్ధ లేకుండా ఉండటం. ఇది మన విశ్వాసం, దేవునితో మన సంబంధం బలహీనపడేలా చేస్తుంది.

### సాధారణ నిద్రకు, ఆత్మీయ నిద్రకు తేడా ఏమిటి?

సాధారణ నిద్ర అనేది మన శరీరం యొక్క అవసరం. ఇది మన దేహానికి విశ్రాంతినిస్తుంది. అయితే, ఆత్మీయ నిద్ర అనేది మన ఆత్మకు సంబంధించినది. ఇది మనల్ని దేవునితో సంబంధం లేకుండా చేస్తుంది. ఆత్మీయ నిద్రలో ఉన్న వ్యక్తి దేవుని వాక్యం వినడానికి, ప్రార్థన చేయడానికి, ఇతరులకు సహాయం చేయడానికి ఆసక్తి చూపించడు.

## సాధారణ నిద్రలేమికి కారణాలు

నేటి విద్యార్థులలో నిద్రలేమికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి:

- ★ **జీవశాస్త్ర కారణాలు:** మెలటోనిన్ అనే హార్మోన్ నిద్రకు చాలా అవసరం. ఈ హార్మోన్ సక్రమంగా ఉత్పత్తి కానప్పుడు నిద్రలేమి సమస్య వస్తుంది.
- ★ **మొబైల్ ఫోన్ల వినియోగం:** నేటి విద్యార్థులు రాత్రి 11, 12 గంటల వరకు మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారుతున్నారు. దీనివల్ల కంటికి వెలుతురు సోకి నిద్ర రాకుండా చేస్తుంది.
- ★ **హోం వర్క్ అధికం కావడం:** చదువుల భారం, హోం వర్క్ ఎక్కువగా ఉండటం వల్ల విద్యార్థులు ఎక్కువ చదవాల్సి వస్తుంది. దీని వల్ల విద్యార్థులు తగినంత సమయం నిద్రకు కేటాయించలేకపోతున్నారు.
- ★ **పని ఒత్తిడి, డిప్రెషన్:** చదువుతో పాటు ఇతర పనుల ఒత్తిడి, డిప్రెషన్ వంటి మానసిక సమస్యల వల్ల కూడా నిద్రలేమి కలుగుతుంది.

## విద్యార్థిలో లోపాలు

ఈ సంఘటనలో విద్యార్థిలో కొన్ని లోపాలు కనిపిస్తాయి:

- ★ మొబైల్ ఫోన్‌కు బానిస కావడం.
- ★ నిద్రకు తగినంత సమయం కేటాయించక పోవడం.
- ★ దేవునితో సరైన సహవాసం లేకపోవడం వల్ల సహవాసంలో కూడా ఒంటరిగా కూర్చోవడం.
- ★ ద్వమనస్కుడిగా ఉండడం వల్ల వాక్యం పట్ల ఆసక్తిని కనపరచలేకపోవడం.
- ★ బాధ్యతారాహిత్యం వల్ల ప్రమాదం కొని తెచ్చు కోవడం.

## నివారణోపాయాలు

ఆత్మీయ నిద్రను జయించడానికి, నిద్రలేమి సమస్యను అధిగమించడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి:

- ★ ప్రతిరోజు ఒకే సమయానికి నిద్రపోవడం, ఒకే సమయానికి నిద్ర లేవడం అలవాటు చేసుకోవాలి.
- ★ పడుకునే ముందు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఉపయోగించకుండా ఉండాలి.
- ★ ప్రతిరోజు దేవునితో ప్రార్థనలో గడపాలి. బైబిల్ చదవాలి.
- ★ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.
- ★ ఒత్తిడిని తగ్గించుకోవడానికి వ్యాయామం చేయాలి.
- ★ సమస్యలు ఉంటే స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా మెంటార్‌తో పంచుకోవాలి.

## ముగింపు

ఆధ్యాత్మిక జీవితం, శారీరక ఆరోగ్యం రెండూ సమతుల్యంగా ఉండాలి. అధిక మొబైల్ ఫోన్ వినియోగం, దేవునితో సన్నిహిత సంబంధం లేకపోవడం వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి రావచ్చు. కాబట్టి, సమతుల్య జీవితం గడపడం, ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం చాలా ముఖ్యం. మన ఆరోగ్యం, ఆనందం, భవిష్యత్తు కోసం ఇది అత్యవసరం.

ఈ వ్యాసం అపొస్తలుల కార్యములు 20వ అధ్యాయం 7 నుండి 12 వచనాలను ఆధారంగా వ్రాయబడింది. ఈ వచనాలలో ఒక సంఘటన గురించి ప్రస్తావించబడింది. పౌలు ప్రసంగి స్తుండగా ఐతుకు అనే ఒక యువకుడు నిద్ర మత్తులో కిటికీలో నుండి పడిపోయి మరణిస్తాడు. అప్పుడు పౌలు అతన్ని బ్రతికిస్తాడు. ఈ సంఘటన ద్వారా మనకు ఒక ముఖ్యమైన విషయం తెలుస్తుంది. అదేమిటంటే ఆత్మీయ నిద్ర కాని, నిద్రలేమి కాని ఎంతో ప్రమాదకరం. కాబట్టి మనం ఎల్లప్పుడూ మేల్కొని ఆధ్యాత్మికంగా సిద్ధంగా ఉండాలి.

**– రవికుమార్, గ్రాడ్యుయేట్, ఖమ్మం.**
**వీరు గురుకుల పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు.**

జీవనశైలి



# దైవ సేవలో కుటుంబ విలువలు

ఆతిథ్యం అనేది గొప్ప లక్షణం. ఇది కేవలం ఒక వ్యక్తికి ఆహారం, ఆశ్రయం ఇవ్వడం మాత్రమే కాదు ఇది ప్రేమ, దయ, గౌరవం లాంటి విలువల వ్యక్తీకరణ. కృతజ్ఞత అనేది మరొక ముఖ్యమైన లక్షణం. ఇది ఇతరులు చేసిన సహాయానికి లేదా మేలుకు మనం చూపే గౌరవం, ఇచ్చే విలువ. దేవుడు ఈ రెండు లక్షణాలను ప్రేమిస్తాడు. వాటిని కలిగి ఉన్నవారిని ఆశీర్వదిస్తాడు.

ఈ నేపథ్యంలో 2 రాజులు 4:8–18 వచనాల్లో మనకు ఒక ఆసక్తికరమైన సంఘటన కనిపిస్తుంది. ఇది ఒక దైవజనుడికి ఆతిథ్యం ఇచ్చిన ఒక కుటుంబం కథ. ఈ కథలో, ఆ కుటుంబ అనురాగం, ఐక్యత, దైవభక్తి, ఆతిథ్యం వంటి గొప్ప విలువలు మనకు కనబడతాయి. ఈ అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తే, మనం దైవసేవలో కుటుంబ విలువలను ఏ విధంగా పాటించవచ్చో తెలుసుకోవచ్చు. అంతేకాకుండా, దేవుడు మనల్ని ఏ విధంగా ఆశీర్వదిస్తాడో కూడా అర్థం చేసుకోవచ్చు.

### షూనేమీయురాలు: ఘనురాలైన స్త్రీ

ఈ కథలో ప్రధాన పాత్ర పోషించిన స్త్రీని "ఘనురాలు" అని పిలువబడినట్లు చూస్తాం. "ఘనురాలు" అంటే మంచి గుణాలు కలిగిన స్త్రీ అని అర్థం. ఆమె తన భక్తి, విశ్వాసం, దాతృత్వంతో అందరికీ ఆదర్శంగా నిలిచింది. దైవజనుడైన ఎలీషా పట్ల ఆమె చూపిన గౌరవం, ప్రేమ ఆమె వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి.

### దైవజనుడికి ఆతిథ్యం: భార్యాభర్తల ఉమ్మడి నిర్ణయం

దైవజనుడైన ఎలీషా ఒకరోజు షూనేము అనే ఊరికి వచ్చినప్పుడు, ఆ ఊరిలో ఉన్న ఒక దంపతులు ఆయనను తమ ఇంటికి ఆహ్వానించారు. ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, ఆ స్త్రీ స్వయంగా నిర్ణయం తీసుకోలేదు. ఆమె తన భర్తతో కలిసి ఈ విషయం గురించి చర్చించి, ఇద్దరూ కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. వారిద్దరూ ఎలీషాను దైవజనుడిగా గుర్తించి, ఆయనకు ఆతిథ్యం ఇవ్వడానికి అంగీకరించారు.

ఆ దంపతులు ఎలీషాకు భోజనం ఏర్పాటు

చేయడమే కాకుండా, ఆయన కోసం ఒక ప్రత్యేక గదిని కూడా సిద్ధం చేశారు. ఆ గదిలో ఒక మంచం, బల్ల, పీట, దీపస్తంభం వంటి వస్తువులను ఏర్పాటు చేశారు. దీనిని బట్టి వారు ఎలీషాకు ఎంత శ్రద్ధగా సేవ చేశారో అర్థం చేసుకోవచ్చు.

### కుటుంబ విలువలు: ఐక్యత, గౌరవం, దాతృత్వం

ఈ సంఘటనలో మనకు అనేక కుటుంబ విలువలు కనిపిస్తాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి:

* **ఒకరినొకరు గౌరవించుకోవడం:** భార్యాభర్తలు ఇద్దరూ ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకున్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా ఇద్దరూ కలిసి చర్చించి తీసుకున్నారు.
* **ఉమ్మడి నిర్ణయాలు:** కుటుంబానికి సంబంధించిన ఏ విషయంలోనైనా భార్యాభర్తలు ఇద్దరూ కలిసి నిర్ణయాలు తీసుకునేవారు.
* **సేవాభావం:** ఇతరులకు సహాయం చేయాలనే తపన వారిలో ఎక్కువగా ఉంది. అందుకే వారు ఎలీషాకు ఆతిథ్యం ఇవ్వడానికి ముందుకొచ్చారు.
* **దైవభక్తి:** వారు దేవుని సేవకులను గౌరవించారు. వారి గృహాన్ని దేవుని పరిచర్య కోసం తెరిచారు.
* **దాతృత్వం:** దేవుని పరిచర్య కోసం తమ డబ్బును వెచ్చించడానికి వారు సిద్ధంగా ఉన్నారు.
* **ఐక్యత:** వారిద్దరి మధ్య మంచి అవగాహన ఉంది. ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకున్నారు.

### ఎలీషా ప్రతిస్పందన: కృతజ్ఞత, ప్రార్థన, ఆశీర్వాదం

ఆ దంపతుల ఆతిథ్యానికి ఎలీషా గంభీరంగా స్పందించాడు. వారి అవసరాలను గమనించి, వారికి సహాయం చేయాలని కోరుకున్నాడు. ఆ దంపతులకు పిల్లలు లేరు. ఎలీషా వారి కోసం దేవునికి ప్రార్థించగా, దేవుడు తన ప్రార్థన ఆలకించి వారికి ఒక కుమారుడిని ప్రసాదించాడు.

### దేవుని ఘనపరిస్తే, ఆయన మనలను ఘనపరుస్తాడు

ఈ వృతాంతం ద్వారా మనం ఒక ముఖ్యమైన విషయం నేర్చుకోవచ్చు. మనం దేవునిని ఘనపరిస్తే, ఆయన మనలను కూడా ఘనపరుస్తాడు. ఆ దంపతులు ఎలీషాను, అంటే దేవుని సేవకుడిని ఘనపరిచారు. కాబట్టి, దేవుడు వారిని కుమారుడితో ఆశీర్వదించాడు.

### దైవ ఆశీర్వాదాల ప్రభావం

దేవుని ఆశీర్వాదాలు కుటుంబ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతాయి. ఒక కుటుంబం ఐక్యతతో ఉండి, పరస్పరం గౌరవంతో జీవిస్తే, ఆ కుటుంబం దైవ శక్తిని అనుభవిస్తుంది. దాతృత్వం, సేవాభావం, ఆతిథ్యంతో కూడుకున్న కుటుంబ జీవితంలో దేవుని అనుగ్రహం అధికమవుతుంది.

అలాంటి కుటుంబాలలో ఆయా సభ్యుల మధ్య ప్రేమ, శాంతి, సహకారం ఉంటుంది. వారి ఆత్మీయ జీవితం దృఢంగా ఉంటుండటమే కాకుండా, సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

### ప్రొఫెసర్ ఇనాక్ కుటుంబం: ఆత్మీయ బిడ్డలు

ప్రొఫెసర్ ఇనాక్ కుటుంబానికి పిల్లలు లేకపోయినా, వారు తమ ఇంటిలో గొప్ప పరిచర్య చేశారు. దేవుని ఆశీర్వాదం ద్వారా వేలాది మంది ఆత్మీయ బిడ్డలను పొందారు. యుఇయస్ఐ పరిచర్యలో వారి సేవ ఎంతో గొప్పది.

### ముగింపు

2 రాజులు 4:8-18లోని ఈ కథ మనకు అనేక విలువైన పాఠాలు నేర్పుతుంది. కుటుంబ సభ్యులు ఒకరినొకరు గౌరవించుకోవడం, కలిసి నిర్ణయాలు తీసుకోవడం, ఇతరులకు సహాయం చేయడం, దేవుని సేవకులను ఆదరించడం వంటి విషయాలు మన జీవితాల్లో ఎంతో ప్రాముఖ్యమైనవి. మనం దేవునిని ఘనపరిస్తే, ఆయన మనలను కూడా ఘనపరుస్తాడని గుర్తుంచుకోవాలి. ప్రొఫెసర్ ఇనాక్ కుటుంబంలాగే, మన జీవితాలను దేవుని సేవకు అంకితం చేస్తే, ఆయన మనలను కూడా గొప్పగా ఆశీర్వదిస్తాడు.

– డి. సుధాకర్, రీజినల్ స్టాఫ్, నల్గొండ



# క్రైస్తవ హతసాక్షి - బ్లాండినా
## (క్రీ.శ. 162 - 177)

ప్రతి ఒక్కరి జీవితంలోనూ సవాళ్లు ఎదురవుతుంటాయి. అయితే, వాటిని ధైర్యంగా ఎదుర్కొని నిలబడేవారే నిజమైన విజేతలుగా నిలుస్తారు. అలాంటి వారిలో బ్లాండినా ఒకరు. ఫ్రాన్స్ దేశానికి చెందిన ఈమె, మార్కస్ ఆరేలియస్ చక్రవర్తి పాలనలో లుగ్దునుమ్ (ప్రస్తుత లియోన్, ఫ్రాన్స్)లో క్రైస్తవ విశ్వాసం కోసం ప్రాణాలర్పించిన ఒక ధీర వనిత.

క్రీస్తు శకం మొదటి రెండు శతాబ్దాలలో క్రైస్తవులకు ఎన్నో కష్టాలు ఎదురయ్యాయి. స్థానిక రోమన్ అధికారులు వారిని తీవ్రంగా హింసించేవారు. రెండవ శతాబ్దంలో రోమన్ చక్రవర్తులు క్రైస్తవ మతాన్ని ఒక సమస్యగా పరిగణించి, దానిని తమ ఉద్యోగులే పరిష్కరించాలని ఆదేశించారు. మార్కస్ ఆరేలియస్ పాలనలో క్రైస్తవులపై హింస మరింత ఎక్కువైంది. ఆయనే స్వయంగా ఈ హింసలను ప్రోత్సహించాడని చరిత్రకారులు చెబుతున్నారు.

### సంప్రదాయ చరిత్ర

బ్లాండినా గురించి మనకు తెలిసిన వివరాలను ప్రముఖ చరిత్రకారుడు యూసేబియస్ తన రచన “హిస్టోరియా ఎక్లెసియాస్టికా”లో వివరించాడు. ఆమె లియోన్ ప్రాంతానికి చెందిన క్రైస్తవ అమరవీరుల బృందానికి చెందినది.

ఈ బృందంలోని కొంతమంది క్రైస్తవులు 177లో, రోమన్ చక్రవర్తి మార్కస్ ఆరేలియస్ పాలనలో అమానుష చిత్రహింసలకు గురై, చివరికి మరణశిక్షను అనుభవించారు.

బ్లాండినా గురించిన సమాచారం ప్రధానంగా లియోన్ చర్చ్ నుంచి ఆసియా మైనర్‌లోని చర్చిలకు పంపిన లేఖల ద్వారా బహిర్గతమయ్యాయి. యూసేబియస్ తన పుస్తకంలో ఈ లేఖల ఆధారంగా ఆమె జీవితం, మరణానికి సంబంధించిన విషయాలను వివరించాడు.

లియోన్ నగరంలో అప్పటి రోమన్ ప్రజలు క్రైస్తవులను వ్యతిరేకంగా చూశారు. క్రైస్తవులు తమ విశ్వాసాన్ని బహిరంగంగా ప్రకటించినప్పుడు వారు వేధింపులకు గురయ్యారు.

## క్రైస్తవ విశ్వాసులపై హింస

ఆ రోజుల్లో, రోమన్ గవర్నర్ లేని సమయంలో, స్థానిక పరిపాలన బాధ్యతలు చేపట్టిన సైనిక కమాండర్ అయిన చిల్యార్చ్, సివిల్ మేజిస్ట్రేట్ అయిన డుమ్వీర్ అనే అధికారులు తమ విశ్వాసాన్ని ప్రకటించిన అనేక మంది క్రైస్తవులను బంధించి జైలుకు పంపారు.

గవర్నర్ తిరిగి వచ్చిన తరువాత, ఖైదు చేయబడిన విశ్వాసులను విచారణకు పిలిపించారు. వారిలో బ్లాండినా అనే ఒక బానిస కూడా ఉంది. ఆమె తన యజమానితో పాటు అదుపులోకి తీసుకోబడింది, ఆ యజమాని కూడా క్రైస్తవురాలు. బ్లాండినా శారీరకంగా బలహీనంగా ఉండటం వలన, ఆమె చిత్రహింసలకు గురి కాకపోవచ్చని ఆమె సహచరులు భావించారు. కానీ గవర్నర్ ఆమెను అత్యంత భయంకరమైన రీతిలో చిత్రహింసలకు గురి చేశాడు. అయినప్పటికీ, ఆమె దృఢమైన విశ్వాసంతో ఉంది. ప్రతి ప్రశ్నకు ఆమె ఒకటే సమాధానం చెప్పింది: "నేను క్రైస్తవురాలిని, నేను ఏ తప్పూ చేయను."

## లియోన్ నగరంలో బ్లాండినా, ఆమె సహచరులు

లియోన్‌లోని యాంఫిథియేటర్ డెస్ ట్రోయిస్-గౌల్స్ ఎరీనాలో ఒక స్తంభం ఉంది. ఇది బ్లాండినాతో సహా అమరవీరుల స్మారకంగా నిలిచింది. ఆ రోజుల్లో క్రైస్తవులను హింసించేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. వారిపై తప్పుడు ఆరోపణలు మోపారు. హింసకు గురవుతామనే భయంతో బానిసలైన క్రైస్తవులు తమ యజమానులకు వ్యతిరేకంగా గుమిగూడినప్పుడు నరమాంస భక్షణ చేస్తున్నారని, అక్రమ సంబంధాలు పెట్టుకుంటున్నారని నిందించారు. ఇది అప్పటి సమాజంలో క్రైస్తవుల గురించి ప్రచారంలో ఉన్న ఒక దుష్ప్రచారం. ఈ రకమైన అపవాదులు తరువాతి శతాబ్దాల వరకు కొనసాగాయి.

ఈ అపవాదులను నిజం చేయడానికి గవర్నర్ క్రైస్తవ ఖైదీల నుండి ఒప్పుకోలు తీసుకోవాలని ప్రయత్నించాడు. కానీ, ఈ అపవాదులు నిజం కాదు. అప్పట్లో క్రైస్తవులపై వ్యతిరేకత చాలా ఎక్కువగా ఉండేది. అందుకే ఈ అపవాదులు వారిని దూషించడానికి, వారిని అణచివేయడానికి ఉపయోగించబడ్డాయి.

అప్పటి రోమన్ గవర్నర్ క్రైస్తవులను చిత్ర హింసలు పెట్టి వారి విశ్వాసం నుండి దూరం చేయాలని ప్రయత్నించాడు. ఎవరైతే తమ విశ్వాసాన్ని విడిచిపెట్టడానికి నిరాకరించారో, వారిని చంపమని చక్రవర్తి మార్కస్ ఆరేలియస్ ఆదేశించాడు. రోమన్ పౌరులైతే ఉరితీయడం ద్వారా శిరచ్ఛేదం చేయాలని, పౌరసత్వం లేని వారిని చిత్రహింసలకు గురిచేయాలని గవర్నర్‌కు ఆదేశించాడు.

బ్లాండినా, అనేక మంది ఆమె సహచరులతో పాటు బహిరంగ క్రీడల సమయంలో పట్టణంలోని యాంఫిథియేటర్ (ఆంఫిథియేటర్ ఆఫ్ ది త్రీ గాల్స్ అని పిలుస్తారు) లో చిత్రహింసలకు గురైంది. వారిలో 15 సంవత్సరాల వయస్సున్న పోంటికస్

అనే బాలుడు కూడా ఉన్నాడు. బ్లాండినా అతనికి ధైర్యం చెప్పి, క్రీస్తుపై విశ్వాసం ఉంచేలా ప్రోత్సహించింది. ఆ బాలుడు కూడా తన విశ్వాసానికి కట్టుబడి నిలిచాడు. అమరవీరులైన వారిలో పోంటికస్ చిన్నవాడు.

### బ్లాండినా వివిధ రకాలుగా హింసించబడుట

బ్లాండినాను ఎన్నో రకాలుగా హింసించారు. శిలువ ప్రతిబింబించేలా ఆమెను ఒక స్తంభానికి కట్టేసి, క్రూర మృగాలను ఆమెపైకి వదిలారు. ఆ సమయంలో కూడా బ్లాండినా తన సహచరుల కోసం, తనను బంధించిన వారి కోసం ప్రార్థించడం మానలేదు. ఆమె నిగ్రహానికి, దైవభక్తికి ఇది నిదర్శనం. చరిత్ర కథనాల ప్రకారం, ఆ మృగాలు ఆమెను ఎప్పుడూ తాకలేదు. ఆమెను స్తంభం మీద నుండి తీసివేసి తిరిగి జైలులో వేశారు.

చాలా రోజుల తర్వాత, ఆమెను లొంగదీసు కోవడానికి మరో ప్రయత్నం చేశారు. ఆమె సహచరులు పడుతున్న బాధలను చూపిస్తే ఆమె మారుతుందేమో అని భావించారు. ఆమెను ఎర్రటి వేడి గొయ్యిపై ఉంచి, ఒక వలలో చుట్టి, అడవి మృగం ముందు విసిరారు. అయినప్పటికీ, ఆమె తన విశ్వాసాన్ని విడనాడలేదు. చివరికి ఆమెను కత్తితో పొడిచి చంపారు.

### ముగింపు

లియోన్ అమరవీరుల కథలో బ్లాండినా పాత్ర చాలా ప్రత్యేకమైనది. ఆమె కేవలం ఒక క్రైస్తవ విశ్వాసిగానే కాకుండా, తన పిల్లలు అమరవీరులుగా మారడానికి ముందు, దేవుని కోసం అమరవీరులుగా పంపే తల్లిగా చిత్రీకరించబడింది. "బ్లాండినా తన పిల్లలందరి పరీక్షలను తానే స్వయంగా ఎదుర్కొన్నట్లుగా నిలిచింది." చిన్న వయస్సులోనే అమరవీరులలో చిన్నవాడైన పోంటికస్‌తో బ్లాండినా సంబంధాన్ని మక్కాబీలలోని తల్లితో పోల్చారు. ఈ విధంగా, బ్లాండినాకు తల్లి పాత్ర ఇవ్వబడింది.

అనేక మంది ప్రారంభ క్రైస్తవ అమరవీరుల మాదిరిగానే బ్లాండినా కూడా క్రీస్తు కోసం పోరాడిన ఒక అథ్లెట్‌గా అభివర్ణించవచ్చు. అథ్లెట్ అంటే క్రీస్తు కోసం చనిపోవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తి. బ్లాండినా బలహీనురాలిగా కనిపించినప్పటికీ, ఆమె ఒక రోజు మొత్తం హింసను భరించగలిగి ంది. అంతేకాదు, తన కోసం, తన సహచరుల కోసం ప్రార్థిస్తూ యంఫిథియేటర్ లోపల తన వేధింపులకు వ్యతిరేకంగా విజయం సాధించింది. బ్లాండినా తన ప్రత్యర్థులను పదేపదే ఓడించడానికి కారణం ఆమె క్రీస్తు ప్రేమను ధరించింది. తద్వారా "అమరత్వ కిరీటాన్ని" గెలుచుకుంది.

బ్లాండినా, ఆమె తోటి క్రైస్తవులు తమ విశ్వాసంతో మరణించారు. చర్చి ఫాదర్ టెర్టులియన్, "అమరవీరుల రక్తమే సంఘానికి బీజం" అని పేర్కొన్నాడు. వారి త్యాగం వృథా పోలేదు. రెండు శతాబ్దాలలో క్రైస్తవ మతం లియోన్‌లోనే కాకుండా, రోమా సామ్రాజ్యం అంతటా అధికారిక మతంగా స్వీకరించ బడింది.

క్రైస్తవులుగా మనం ఎదుర్కొనే కష్టాలు, శ్రమలు మనకు విజయాలుగా మారతాయని తెలుసు కోవాలి. కష్టాల్లో ఉన్న వ్యక్తుల కోసం, సంఘాల కోసం, ప్రాంతాల కోసం ఎల్లప్పుడూ ప్రార్థించాలి. మత్తయి 5:11-12 వచనాల్లో చెప్పినట్లుగా, "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీ మీద అబద్ధంగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును." ఈ వచనాలను జ్ఞాపకం చేసుకొంటూ విశ్వాస జీవితంలో ముందుకు సాగుదాం.

**(పై వ్యాసం ఇంటర్నెట్ వనరుల నుండి సేకరించ బడినది)**

– రూత్ వినయ్,
ప్రగతినగర్, హైదరాబాద్






# ప్రేమతో అమ్మకు!

వేసవి సెలవులు అంటేనే ఎంతో ఆనందం! విద్యార్థులైతే ఇక చెప్పనక్కర్లేదు. పరీక్షల హడావుడి నుండి, చదువుల ఒత్తిడి నుండి కాస్త విముక్తి లభిస్తుంది. వేసవి సెలవులు రాగానే ప్రతి ఒక్కరూ తమ సొంత ఊళ్లకు వెళ్లాలని ఆత్రుతగా ఎదురు చూస్తుంటారు. ఇల్లు చేరగానే అమ్మ చేతి వంటలు, స్నేహితులతో సరదాగా గడపడం, ఆటలు ఆడటం... ఇలా ఎన్నో సరదాలు ఊరిస్తుంటాయి.

ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న వేసవి సెలవులు రానే వచ్చాయి. ప్రతి సంవత్సరం వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. ఈ సంవత్సరం కూడా ఎండలు బాగా పెరిగి పోయాయి. దీనికి తోడు హాస్టల్‌లో నీటి సమస్య కూడా మొదలైంది. దీంతో అధికారులు ప్రకటించిన సెలవుల కంటే నాలుగు రోజుల ముందే విద్యార్థులను ఇళ్లకు వెళ్లడానికి అనుమతించారు. ఈ విషయం తెలియగానే విద్యార్థులందరూ ఎంతో సంతోషించారు.

సెలవుల గురించి తెలిసిన వెంటనే వారం రోజుల ముందుగానే నేను నా సామాను సర్దుకోవడం మొదలుపెట్టాను. నాకు చాలా సామాన్లు ఉండటంతో నన్ను తీసుకెళ్లడానికి నాన్న వస్తానని చెప్పాడు. హాస్టల్‌లో ఒక్కొక్కరుగా ఇళ్లకు వెళ్లడం మొదలుపెట్టారు. అలా హాస్టల్ మెల్లమెల్లగా ఖాళీ అవుతూవుంది.

“సాహిత్యా! నా లగేజ్ కొంచెం ఎక్కువగా ఉంది. మెయిన్ గేట్ వరకు నా లగేజ్ పట్టుకొస్తావా?” అని చాలామంది అడుగుతున్నారు. వాళ్లందరి కీ సహాయం చేస్తుంటే నాకు కొంచెం బాధగా అనిపించింది. వాళ్ల లగేజీ మోస్తున్నందుకు కాదు. నేను వెళ్ళే సమయానికి నా లగేజీ తీసుకెళ్లడానికి ఎవరూ ఉండరేమోనని బాధపడ్డాను. కానీ, కాస్త ఆలస్యంగా అయినా నాన్న రావడం నేను ఇంటికి రావడం జరిగింది.

* * * * * *

చాలా రోజుల తరువాత ఇంటికి తిరిగి వచ్చాను. హాస్టల్ తిండి తినలేక, తిండికి మొహం వాచినట్లు అమ్మ ఏం పెట్టినా, ఎంతో రుచిగా ఉండటం వలన, పెట్టినవన్నీ ఎంతో ఇష్టంగా తిన్నాను. తినడం, నిద్ర పోవడం రెండు రోజులకే బోర్ అన్పించింది. నాన్న తన పనుల మీద బయటికి వెళ్ళిపోతాడు. అన్నయ్య, ఏమో ఎగ్జామ్స్ కోసం

చదువుకుంటున్నాడు. మా అమ్మకు సంగీతం, సాహిత్యం అంటే చాలా మక్కువ. అందుకే ఆ పేర్లే పెట్టింది మాకు.

అమ్మయితే ఒక్క క్షణం ఖాళీగా ఉండదు. ఏదో ఒక పని చేస్తూనే ఉంటుంది. ఇంటి పనులతో పాటు బంధువులు, స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకుంటుంది. ప్రార్థన చేసుకుంటూనో, బైబిలు చదువుకుంటూనో కనీసం ఏదైనా బుక్ చదువుతూనే ఉంటుంది. అమ్మ, నాన్న ఇద్దరు కలిసి చదివిన, విన్న వాక్యాల గురించి మాట్లాడుకుంటూ ఉంటారు. లేకపోతే అమ్మ తన కిష్టమైన పాటలు పెట్టుకొని వింటూ, పాడుకుంటూ పనులు హుషారుగా, సంతోషంగా చేసుకుంటుంది. పనులు చేస్తున్నప్పుడు తన నొప్పులను కూడా పట్టించుకోదు. పనులు అన్నీ అయ్యాక చేతులు, కాళ్ళు నొక్కుకుంటూ కుర్చీలో కూలబడుతుంది. అమ్మను చూస్తే జాలి, బాధ కలుగుతాయి. ఏదైనా సహాయం చేయాలనిపిస్తుంది కానీ అంతగా చేయలేక పోతున్నాను.

* * * * * *

స్టూడెంట్స్‌ను కలవడం, లేదా ఫోన్‌చేసి వాళ్ళతో మాట్లాడం, వాళ్ళ విషయాలు తెలుసుకోవడం, ప్రార్థించడం, ప్రోత్సాహించడం ఎప్పుడు చేస్తూనే ఉంటుంది. ప్రతి చిన్నవిషయాన్ని అమ్మతో పంచుకోవడం నాకు అలవాటు. చాలా చిన్న విషయాలు చెప్పినా ఎంతో ఆలోచించి నాకు మంచి సలహాలు ఇస్తుంది. వాక్యాన్ని గుర్తు చేసి నన్ను బలపరుస్తుంది.

హాస్టల్‌లో జరుగుతున్న బైబిలు స్టడీకి వెళ్ళమని అమ్మ ఎన్నోసార్లు చెప్పినా నేను వెళ్ళడానికి ఇష్టపడేదాన్ని కాదు. ఎందుకంటే, అక్కడ ఎవ్వరికి నచ్చినట్లు వాళ్ళు బైబిల్ స్టడీని లీడ్ చేస్తారు. వాళ్ళు నాకు నచ్చరు. అందుకే నాకు వెళ్ళాలని అనిపించేది కాదని అమ్మతో చెప్పేదాన్ని.

దానికి అమ్మ, “తెలియని వాళ్ళకు ఎలా లీడ్ చేయాలో, ఎలా బైబిల్ స్టడీ తీసుకోవాలో నువ్వు నేర్పించు. ఇయులో అన్నీ తెలుసుకొన్న నిన్ను దేవుడు అక్కడికి ఉంచిన ఉద్దేశ్యం అదే కావచ్చు! ఫెలోషిప్‌కు మాత్రం దూరం అవ్వకూడదు. ఫెలోషిప్ లేకుండా చేయడానికి సాతాను అనేక ప్రయత్నాలు చేస్తుంటాడు. నీకోసం ప్రార్థించే వాళ్ళు, నీకుండటం ఎంతో శ్రేయస్కరం. ఒంటరిగా ఉంటే సాతాను అటాక్ చేస్తాడు. ఎవరిని మ్రింగుదునా అంటూ వాడు గర్జించు సింహం లాగా ఎదురు చూస్తుంటాడు. వాళ్ళు ఎలా లీడ్ చేసినా సరే వాళ్ళందరూ క్రీస్తు యేసు రక్తంతో కడగబడినవారే. విమోచింపబడిన వారి మధ్యలో ఉండటం ఎంతో భద్రత, ఎంతో మంచిది కూడా” అని చెప్పింది.


అమ్మ చెప్పిన మాటలు నాకు మంచిగా అనిపించాయి. తర్వాత చిన్న చిన్న బైబిల్ స్టడీస్ తీసుకోవడం వలన వారితో నాకు మంచి సహవాసం ఏర్పడింది. ఒకరికొకరు ప్రార్థించుకుంటాం, ప్రోత్సహించుకుంటాం. ఒక బ్యాచ్‌కు ఎగ్జామ్స్ ఉంటే అందరం కలిసి వారి కోసం ప్రార్థిస్తాం. ఇప్పుడు ఒక పద్ధతిలో మా బైబిల్ స్టడీస్ జరుగుతున్నాయి. ఇదంతా అమ్మ నాకు గైడ్ చేయడం వల్లే సాధ్యమైంది.

ఇంట్లో ఉన్నప్పుడు అమ్మను నిర్లక్ష్యం చేశాను. కానీ, హాస్టల్‌లో ఉండగా అమ్మ గొప్పదనం అర్థమైంది. దేవుడు తన ప్రేమకు గుర్తుగా అమ్మను మాకిచ్చాడు అనుకుంటా. అమ్మతో నా వేసవి సెలవులు క్షణాల్లా గడిచిపోయాయి.

మదర్స్ డే రోజు మంచి గ్రీటింగ్ కార్డు తయారు చేసి ఇచ్చాను. ఆ కార్డు చూసి అమ్మ పొందిన ఆనందం నేను ఎప్పటికీ మర్చిపోలేను. మంచి అమ్మను ఇచ్చినందుకు మనసులోనే దేవాది దేవునికి కృతజ్ఞతలు తెలిపాను.

– **చేగూడి శ్యామలా కృపారావ్,**
**టీచర్ మరియు గ్రాడ్యుయేట్, ఎ.జి జోన్**

# మే ‘25 యెహెజ్కేలు గ్రంథము (5 – 6 అధ్యాయాలు)



**అడ్డం**

1. నీవు చేసిన హేయమైన క్రియలన్నిటి చేత నా పరిశుద్ధస్థలమును ఏమి చేసితివి అని దేవుడు అంటున్నారు?
3. కరవు వచ్చి యుండగా నీలో మూడవ భాగము ఎందుచేత మరణమవును?
4. ఇశ్రాయేలీయుల కళేబరములను ఎక్కడ పడవేసేదను అని దేవుడు చెప్పున్నారు?
6. నరపుత్రుడా, నీవు ఏటువంటి కత్తి తీసికొని నీ తలను గడ్డమును క్షౌరము చేసికొనుమని దేవుడు చెప్పున్నారు?
8. చేతులు చరిచి నేల తన్ని ఇశ్రాయేలీయుల హేయకృత్యములనుబట్టి ఏమని అంగలార్చాలి?
9. మీ ఉన్నత స్థలములు ఏమగును?
11. ఈ ప్రకారము నేను నీకు శిక్ష విధించి నీలో శేషించిన వారిని నలుదిశల ఏమి చేతును అని దేవుడు చెప్పున్నారు?
13. మీ జనులు ఏమై కూలుదురు?
14. శేషించి ముట్టడి వేయబడినవారు దేనిచేత చత్తురు?
15. పిమ్మట వాటిలో కొన్నిటిని మరల తీసి అగ్నిలో వేసి కాల్చుము దానినుండి అగ్ని బయలు దేరి ఎవరిని తగులబెట్టును?

**నిలువు**

2. నరపుత్రుడా, ఇశ్రాయేలీయుల ఏ తట్టు చూచి వాటివిషయమై యీ మాటలు ప్రక టించుము అని దేవుడు చెప్పున్నారు?
5. ఈ ప్రకారము నేను నీమీదికి క్షామమును ఇంకా ఏమి పంపుదును?
7. మీరు మీ చుట్టునున్న దేశస్థులకంటె మరి యధిక ముగా ఏమి అయ్యారు అని దేవుడు చెప్పున్నారు?
8. యెరూషలేమేను ఎవరి మధ్య దాని నుంచితిని అని దేవుడు చెప్పున్నారు?
10. వారు నివసించు స్థలములన్నిటిలో వారి దేశమును ఏ అరణ్యము కంటె నిర్జనముగాను పాడుగానుచేతును అని దేవుడు చెప్పున్నారు?
12. నా విధులను కట్టడలను త్రోసి వేసి తమ చుట్టునున్న అన్యజనుల కంటెను అధికముగా ఏమి అయ్యారు అని దేవుడు చెప్పున్నారు?
13. మీ బొమ్మల యెదుట మీ జనులను నేను ఏమి చేసెదను?

– కె.కిరణ్ కుమార్, స్టాఫ్, మహబూబ్‌నగర్

## ఏప్రిల్ ‘25 యెహెజ్కేలు గ్రంథము (3 – 4 అధ్యాయాలు)

**అడ్డం:** 3. తేనెవలె మధురముగా 6.జడియకుము 9. నా మాటలు 10. యెడమప్రక్కను 12. ఇశ్రాయేలీయుల యొద్దకే 14. ప్రకటన 17. బహు చింతతో 18. దోషము వలన 19. కఠినమైనదిగా

**నిలువు:** 1.కావలిగా 2.అరపడి 3.తేలాబీలు 4. మూడువందల తొంబది 5. సిగ్గుమాలిన 7. కుడిప్రక్క 8. ఇనుపరేకొకటి 10.యెరూషలేము 11.నిషిద్ధమైన 12.ఇరువది 13.యేడు 15.కట్లతో 16.గోమలము

**విజేతలు:** 1.జ్యోతి గంగారాం, కొంపల్లి 2.శ్రీలత బాలాజీ, స్టాఫ్ సైనిక్‌పురి 3.వై. సంతోష ఇమ్మాన్యుయేల్, సంగారెడ్డి 4.యం.స్వప్న తుకారం, రాజన్న సిరిసిల్ల 5.సుజాత యాధార్ధ్ సికింద్రాబాద్ జోన్

# నకిలీ పరిశుద్ధత

మౌనధ్యానాలు ప్రతిరోజు చేస్తాం,

ఆచరించాలని కాదు, అలవాటైందని.

వ్యక్తిగత శ్రద్ధతో బైబిల్ పరిశీలిస్తాం,

అన్వయించుకోవాలని కాదు, అవతలి వాళ్లకు చెప్పాలని.

నీతి బోధలు చేయడానికి ప్రయాసపడతాం,

నీతిగా ఉన్నామని కాదు, అలా కనిపించాలని.

పరిశుద్ధులమని ప్రకటించుకుంటూ,

నిజానికి మనం నిర్లక్ష్యంగా బ్రతికేస్తున్నాం.

పరిశయ్యులను, శాస్త్రులను వేషధారులు, మతాచారులు అంటే,

అవునా! అని ఆశ్చర్యపోయాం, అయ్యో! అని బాధపడిపోయాం.

అందులో మేము ఉన్నామని అర్థమవుతున్నా,

నిర్భయంగా తిరిగేస్తున్నాం, నకిలీ పరిశుద్ధతతో.

- ఎం. చిన్నారి రంగారావు

వార్డ్ అండ్ డీడ్ స్కూల్,

హయత్ నగర్

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

Edited Printed and Published by Mr. Dasari Rajesh for UESI Publication Trust, Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at SRI RR Offset printers, Azamabad, Hyderabad.
(For Private Circulation Only)